సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

www.mudranews.in

హైదరాబాద్
గురువారం, 27.08.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:13 సంచిక: 297
పేజీలు: 08 వెల: రూ. 5


## తెలంగాణలో ఖేలో ఇండియా

- 6 వేల మంది క్రీడాకారుల సందడి
- నాలుగు నగరాల్లో పోటీలు
- రూ.22 కోట్ల నిధులు విడుదల
- యువ క్రీడాకారులతో మోదీ ముచ్చట

02




## కాంగ్రెస్‌లో వరుస భేటీలు

### అసలేం జరుగుతోంది?

### కొండా సురేఖ వివాదం.. రాయబారాలు షురూ!

- భట్టితో కొండా మురళి.. రాజగోపాల్‌రెడ్డి భేటీ
- కొండ ఎపిసోడ్‌లో కీలక మలుపు..
- ప్రజాభవన్‌లో కీలక భేటీ.. కాంగ్రెస్‌లో ఉత్కంఠ
- భట్టిని కలిసిన కొండా మురళి.. ఏం చర్చించారు?
- క్రమశిక్షణ కమిటీ నివేదిక వేళ కాంగ్రెస్‌లో కదలిక
- కాంగ్రెస్‌లో వరుస భేటీల వెనుక కథేంటి?



**ముద్ర హైదరాబాద్ :**
తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో కొండా సుస్మిత వ్యాఖ్యలు, మంత్రి కొండా సురేఖ వ్యవహారం తీవ్ర దుమారం రేపుతున్న వేళ మరో కీలక రాజకీయ పరిణామం చోటుచేసుకుంది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కాంగ్రెస్ నేత, కొండా సురేఖ భర్త కొండా మురళి.. హైదరాబాద్ ప్రజాభవన్‌లో సమావేశం కావడం సర్వత్రా ఆసక్తికరంగా మారింది. అయితే ఈ భేటీకి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కూడా హాజరు కావడం రాజకీయ వర్గాల్లో మరింత చర్చకు దారి తీసింది. అదే సమయంలో అక్కడికి వచ్చిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కూడా ఈ సమావేశంలో పాల్గొనడంతో కాంగ్రెస్ పార్టీ రాజకీయాలు రసవత్తరంగా మారాయి.

మంత్రి కొండా సురేఖ, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డికి సంబంధించిన వ్యవహారంపై ప్రస్తుతం కాంగ్రెస్ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ..టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌కు నివేదిక సమర్పించిన నేపథ్యంలో వీరి భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించిన నేతలపై కఠిన చర్యలు తీసుకోవాలని కమిటీ సిఫార్సు చేసినట్లు తెలుస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో భట్టి విక్రమార్కతో కొండా మురళి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సమావేశం కావడం ఆసక్తిని రేపుతోంది.

అయితే ఈ భేటీ తర్వాత బయటికి వచ్చిన కొండా మురళి మీడియాతో మాట్లాడారు. తన కుమార్తె కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలతో తమకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. కొండా సుస్మితకు తన అభిప్రాయాలను వ్యక్తం చేసే స్వేచ్ఛ ఉందని.. ఆమె వ్యాఖ్యలపై ప్రశ్నించే హక్కు తమకు లేదని పేర్కొన్నారు. తమ బిడ్డ చేసిన వ్యాఖ్యలతో తమాకేం సంబంధం అని వ్యాఖ్యానించారు. క్రమశిక్షణ కమిటీకి చెప్పాల్సిన విషయాలన్నీ ఇప్పటికే వివరించామని తెలిపారు. ఇక.. తమకు సోనియాగాంధీ, మిగతా 02లో

## ఇందిరమ్మ ఇళ్ల లాటరీకి డేట్ ఫిక్స్

### రేపటి నుంచి

- యూట్యూబ్‌లో లైవ్ టెలికాస్ట్
- దళారుల మాటలు నమ్మొద్దు
- పేరు రాకపోయినా మరో ఛాన్స్



**ముద్ర, హైదరాబాద్ :**
హైదరాబాద్‌లోని పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. ఇందిరమ్మ ఇండ్ల (టవర్స్) కేటాయింపుకు సంబంధించిన లాటరీ ప్రక్రియ షెడ్యూల్ అధికారికంగా ఖరారైంది. ఆగస్టు 28 నుండి 31 వరకు నాలుగు రోజుల పాటు ఈ లాటరీ కార్యక్రమాన్ని అత్యంత పారదర్శకంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు హౌసింగ్ బోర్డు అధికారులు వివరాలను వెల్లడించారు.

**లాటరీ నిర్వహణ, ప్రత్యక్ష ప్రసారం**

హైదరాబాద్ నగర పరిధిలోని మొత్తం 16 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఈ లాటరీ ప్రక్రియ కొనసాగుతుంది. ప్రతిరోజూ నాలుగు నియోజకవర్గాల చొప్పున నాలుగు రోజుల పాటు డ్రా తీసీ అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేస్తారు. ఈ లాటరీ విధానంలో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా ఉండేందుకు, ప్రక్రియ మొత్తాన్ని యూట్యూబ్‌లో ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్లు హౌసింగ్ బోర్డు ప్రత్యేక అధికారి వీపీ గౌతం తెలిపారు. దీనివల్ల ప్రజలు ఇంట్లో నుంచే పారదర్శకంగా జరుగుతున్న ఎంపిక విధానాన్ని చూడవచ్చు.

**దళారుల మాటలు నమ్మొద్దు..**
**అధికారుల హెచ్చరిక**

ఈ ఇండ్ల కేటాయింపులో ఎలాంటి పొలిటికల్ సిఫారసులు లేదా మిగతా 02లో

## ఇన్వెస్ట్ తెలంగాణ

### ప్రజాభవన్‌లో ప్రత్యేక వార్ రూమ్

- నిపుణులతో ప్రత్యేక కమిటీల ఏర్పాటు
- దేశ, విదేశాల్లో రోడ్ షోలు
- పెట్టుబడిదారులకు ఆహ్వానాలు వేగవంతం
- తెలంగాణలో పెట్టుబడుల జోరు



**ముద్ర, హైదరాబాద్ :**
తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2026-ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ నిర్వహణలో భాగంగా ప్రజాభవన్‌లో తక్షణమే ప్రత్యేక వార్ రూమ్‌ను ఏర్పాటు చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ కోసం అతిథులకు ఆహ్వాన పత్రాలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా త్వరగా పంపించే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. బుధవారం నాడు మహాత్మా పూలే ప్రజాభవన్ లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘం సమావేశమైంది. ఈ సమావేశంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సహా పలువురు మిగతా 02లో

## మీ సేవా కేంద్రాలే డిజిటల్ మార్కెటింగ్ హబ్‌లు



- రాష్ట్ర వ్యాప్తంగా డిజిటల్ మార్కెటింగ్ సేవల విస్తరణ
- మెటాతో కలిసి వీఎల్‌ఈలకు ప్రత్యేక శిక్షణ
- కొత్త పోర్టల్, టోల్‌ఫ్రీ సేవలను ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు

03

## కృతి యాడ్‌పై పొలిటికల్ వార్



- రాహుల్ గాంధీకి కంగనా కౌంటర్
- రాహుల్ కామెంట్‌పై కంగనా ఫైర్
- భారత్ మాతాకీ జై అంటూ కంగనా విమర్శలు

02

## మండిపోతున్న మార్కెట్

### సామాన్యుడి జేబుకు చిల్లు!




- రెండు నెలల్లోనే 80% పెరిగిన ధరలు
- ఘాటెక్కిన ఉల్లి.. కొండెక్కిన పంచదార
- రికార్డు స్థాయిలో దూసుకుపోతున్న బెల్లం, నూనెలు

02

## జనవరి 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా సంజీవని

### కుప్పం, చిత్తూరు ఫలితాలతో పక్కాగా కార్యాచరణ



- ఏఐ ఆధారిత ఆరోగ్య సేవలకు అత్యధిక ప్రాధాన్యం
- వైద్యారోగ్యం, సంజీవని ప్రాజెక్టులపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

02

## సూర్యాపేటలో మరణమృదంగం

### బస్సు-కంటైనర్ ఢీ.. ఆరుగురు మృతి

- దొరకుంట వద్ద విషాదం..
- 42 మందితో వెళ్తున్న బస్సుకు ప్రమాదం
- బస్సు ప్రమాదంలో ఐదుగురు మహిళలు మృతి



02

## ఇదీ AI ముద్ర



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
గురువారం, 27.08.2026
www.mudranews.in | @mudranews



## వాటర్ బాటిల్ : ఇంట్లో గాజు బాటిల్‌కు ఓటేయండి




గాజు బాటిళ్లు రసాయన రహితంగా ఉండటంతో నీటి నిల్వకు సురక్షితమైన ఎంపికగా భావిస్తారు. నీటి రుచి కూడా మారదు. అయితే బరువు ఎక్కువగా ఉండటం, పగిలిపోయే అవకాశం ఉండటంతో ప్రయాణాల్లో జాగ్రత్త అవసరం.

### జనవరి 1నుంచి రాష్ట్ర వ్యాప్తంగా

# సంజీవని



**అమరావతి, ముద్ర:**
వైద్యారోగ్య సేవలు మరింత మెరుగ్గా అందించేందుకు చేపట్టిన 'సంజీవని ప్రాజెక్టు'ను జనవరి 1 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. డిజిటల్ హెల్త్ రికార్డులతో సంజీవని ప్రాజెక్టు పూర్తి స్థాయిలో అమలైతే వైద్య సేవల్లో అనూహ్య మార్పులు సాధించవచ్చన్నారు. వైద్య సేవల్లో ఏపీని ఇతర రాష్ట్రాలు అనుసరించేలా 'సంజీవని ప్రాజెక్టును విజయవంతం చేయాలని సీఎం సూచించారు. క్యాంపు కార్యాలయంలో బుధవారం 'సంజీవని ప్రాజెక్ట్'పై ముఖ్యమంత్రి అధికారులతో సమీక్షించారు. కుప్పం నియోజకవర్గం, చిత్తూరు జిల్లాల్లో ఇప్పటికే సంజీవని ప్రాజెక్ట్ అమలుతో ఉత్తమ ఫలితాలు వస్తున్నాయని, వీటిని రాష్ట్రమంతటా అమలు చేసేలా చూడాలన్నారు. రాష్ట్రంలో ప్రతీకుటుంబం విద్యకు, వైద్యానికే అత్యధికంగా ఖర్చు పెట్టాల్సి వస్తోందని.. ఈ వ్యయాన్ని తగ్గించేలా చూసేందుకు సంజీవని వంటి కార్యక్రమాలను తీసుకువస్తున్నట్టు ముఖ్యమంత్రి చెప్పారు. సంజీవని ప్రాజెక్టులో అధికారిక భాగస్వామిగా ఉన్న టాటా ఎండీ సంస్థ వైద్యారోగ్య రంగంలో సరికొత్త ఆవిష్కరణలకు కృషి చేయాలని నిర్దేశించారు. సంజీవని కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించేందుకు 90 రోజుల ప్రణాళిక సిద్ధం చేసినట్టు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. బేస్‌లైన్ అధ్యయనం, డిజిటల్ మౌలిక వసతుల ఏర్పాటు, శిక్షణ, సర్టిఫికేషన్, జాతీయ, రాష్ట్ర పోర్టల్స్‌తో ఇంటిగ్రేషన్ వంటి చర్యలు 90 రోజుల ప్రణాళికలో ఉన్నాయని వెల్లడించారు. 28 జిల్లాల్లో వైద్య సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నట్టు వివరించారు.

**డేటా గోప్యత, భద్రతకు ప్రాధాన్యం**
సమీక్షలో సీఎం మాట్లాడుతూ...'ప్రిడెక్టివ్, ప్రివెంటివ్, క్యూరేటివ్, కాస్ట్ ఎఫెక్టివ్‌గా వైద్య సేవలు అందించాలి. వైద్య సేవలు అందించడంతో పాటు ఆహారపు అలవాట్లు, ఆలోచనా విధానం మారేలా చూడాలి. హోమియోపతి, ఆయుర్వేద, యోగా, ప్రాణాయామం, ఇంకా అత్యాధునిక వైద్య విజ్ఞానాన్ని వినియోగించుకోవాలి. ఏఐ డాక్టర్ కూడా విస్తృతంగా వినియోగంలోకి తీసుకురావాలి. డేటాను భద్రపరచడం, గోప్యంగా ఉంచడంతో పాటు.. డ్యాష్ బోర్డు సిద్ధం చేయాలి. ఆస్పత్రుల్లో శానిటేషన్ సహా వివిధ ఔట్ సోర్సింగ్ సేవల విషయంలో దృష్టి పెట్టాలి. సమర్థవంతంగా వైద్య సేవలు అందించని ఔట్ సోర్సింగ్ సర్వీస్ ప్రొవైడర్లను తొలిగించేలా ఒక విధానం తీసుకురావాలి. విశ్వాసం పెంచేలా వైద్య సేవలు ఉండాలి. ప్రజల మొబైళ్లకు నేరుగా హెల్త్ అప్డేట్స్ పంపించేలా వ్యవస్థను తీర్చిదిద్దాలి.' అని చెప్పారు.

**వ్యాధుల నియంత్రణకు దోహదం**
కుప్పం, చిత్తూరు ప్రాంతాల్లో సంజీవని కార్యక్రమం అమలుతో వచ్చిన ఫలితాలను సమీక్షలో ముఖ్యమంత్రి పరిశీలించారు. ప్రాజెక్టు అమలుతో మెరుగైన ఫలితాలు సాధిస్తున్నట్టు అధికారులు వివరించారు. చిత్తూరులో నమోదైన ఫలితాల ప్రకారం.. హైపర్‌టెన్షన్ కేసుల్లో 56 శాతం కేసులు నియంత్రణలోకి వచ్చినట్టు తేలిందన్నారు. దయాబెటిస్ కేసుల్లో 16 శాతం కేసుల తీవ్రత తగ్గిందన్నారు. అలాగే, ప్రైమరీ హెల్త్‌కేర్ సేవల వినియోగంలోనూ గణనీయమైన పెరుగుదల నమోదైనట్టు వెల్లడించారు. సంజీవని సేవలపై పౌరుల అభిప్రాయాలను తెలుసుకునేందుకు నిర్వహించిన సర్వేలో 91 శాతం మంది సంజీవని సేవల అనంతరం తమ ఆరోగ్యంపై అవగాహన పెరిగిందని చెప్పారు. స్క్రీనింగ్ నుంచి చికిత్స, ఫాలోఅప్ వరకు ఏఐ ఆధారిత ఆరోగ్య వ్యవస్థను తీర్చిదిద్దుతున్నట్టు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. సమీక్షలో మంత్రి సత్యకుమార్ యాదవ్, వైద్యారోగ్య శాఖ కార్యదర్శి వీరపాండియన్, సంయుక్త కార్యదర్శి గోపాలకృష్ణ, టాటా ఎండీ సంస్థ ప్రతినిధులున్నారు.

# మండిపోతున్న మార్కెట్



**ముద్ర ప్రతినిధి, ఖమ్మం :**
ప్రపంచవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న రాజకీయ భౌగోళిక ఉద్రిక్తతలు, వాతావరణంలో సంభవిస్తున్న అవాంఛనీయ మార్పులు నేరుగా సామాన్యుడి వంటింటి బడ్జెట్‌ను కుదిపేస్తున్నాయి. ఒకవైపు అమెరికా-ఇరాన్ మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణం, మరోవైపు ఎల్‌నినో సృష్టిస్తున్న అలజడి ఉమ్మడిగా ప్రభావం చూపడంతో మార్కెట్‌లో నిత్యావసర సరుకుల ధరలు భగ్గుమంటున్నాయి. పొయ్యి వెలిగించి వంట చేయడానికే కాదు, అసలు సంతకు వెళ్లి సరుకులు కొనడానికే సామాన్యుడు భయపడే పరిస్థితి నెలకొంది.

ముఖ్యంగా రోజువారీ వంటకాల్లో అత్యంత కీలకమైన ఉల్లిగడ్డ ధరలు వినియోగదారుల కళ్లలో నీళ్లు తెప్పిస్తున్నాయి. మొన్నటివరకు కిలో రూ.25 చొప్పున లభించిన ఉల్లి, ఒక్కసారిగా రూ.60కి చేరుకుని షాక్ ఇచ్చింది. ఇక ప్రతి ఇంట్లోనూ ప్రధాన ఆహారమైన బియ్యం ధరలు కూడా భారీగా పెరిగాయి. మంచి క్వాలిటీ బియ్యం కిలో ఏకంగా రూ.70 పలుకుతుంది.

**పెరిగిన ధరల వివరాలు..**
(రెండు నెలల క్రితం vs ఇప్పుడు):ఉల్లిగడ్డ: రూ. 25 నుండి రూ. 60 కిబియ్యం: రూ. 70 పలుకుతోంది (KTR క్వాలిటీ)కందిపప్పు: రూ. 110 నుండి రూ. 130-140వెల్లుల్లి: రూ. 160 నుండి రూ. 230-250నూనెలు (పామాయిల్ /సన్ ఫ్లవర్): రూ. 110నుండి రూ. 180 వరకుచింతపండు: రూ. 200 నుండి రూ. 250-300పంచదార: రూ. 45 నుండి రూ. 58-60బెల్లం: రూ. 50 నుండి రూ. 70-80 పేద, మధ్యతరగతి కుటుంబాలు ఆందోళనలో కూరుకుపోయాయి. పంచదార, బెల్లం ధరలు గతంలో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయికి దూసుకెళ్తుండగా, వంటకు ఉపయోగించే మసాలా దినుసులైన పసుపు, కారం, వెల్లుల్లి, ఎండుమిర్చి సహా వంట నూనెల ధరలు కూడా విపరీతంగా పెరిగిపోయాయి.

**వంటింట్లో కన్నీళ్లు - మహిళల ఆవేదన**
ధరల పెరుగుదలతో అత్యధికంగా ఇబ్బంది పడేది గృహిణులే. "గతంలో ఐదారు వందలకు వచ్చిన సరుకులు నేడు వెయ్యి , పన్నెండు వందలు అవుతున్నాయని మహిళలు వాపోతున్నారు. పిల్లలకు పౌష్టికాహారం పెట్టాలన్నా భయమేస్తోందని, ఉల్లి, పప్పు లేకుండా వంట చేయాల్సి వస్తోంది" అని వాపోయారు.రిటైల్ మార్కెట్ లో పండ్ల ధరలు కూడా 60% వరకు పెరిగిందని, కూరగాయల్లో టమాటా, వంకాయ, బెండకాయ వంటి సాధారణ కూరగాయల ధర కూడా రెట్టింపు అయ్యాయని ఆవేధన వ్యక్తం చేస్తున్నారు.

మార్కెట్‌కు వెళ్లిన ప్రతీ కొనుగోలుదారుడు నిత్యం పెరిగిన ధరలను చూసి బెంబేలెత్తిపోతున్నాడు. నిత్యావసరాల ధరలు సలసల కాగుతుండటంతో "ఏం కొనేటట్టు లేదు.. ఏం తినేటట్టు లేదు" అంటూ సగటు జీవి తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే సామాన్య, మధ్య తరగతి ప్రజలు పండగలు కూడా చేసుకోలేని దుస్థితి వస్తుందని సామాజిక వేత్తలు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి, రేషన్ ద్వారా సబ్సిడీ ధరలకు నిత్యావసరాలు అందించడంతో పాటు, నల్లబజారును అరికట్టాలని, ధరల పెరుగుదలను నియంత్రించాలని, మార్కెట్‌ను అదుపులోకి తెచ్చేలా ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### సూర్యాపేట జిల్లాలో

# మరణమృదంగం

**ముద్ర, సూర్యపేట :**
సూర్యాపేట జిల్లా కోదాడ మండలం దొరకుంట శివారులో బుధవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. హైదరాబాద్ నుంచి ఏలూరు (విజయవాడ మార్గం) వైపు వెళ్తున్న ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు, దొరకుంట సమీపంలో ఆగి ఉన్న కంటైనర్ లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఆ లారీలో భారీ ఇనుప కడ్డీలు ఉండటంతో ప్రమాద తీవ్ర పెరిగింది. ఈ ప్రమాద సమయంలో బస్సులో మొత్తం 42 మంది ప్రయాణికులు ఉన్నారు. ఈ తీవ్ర ప్రమాదంలో ఆరుగురు ప్రయాణికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మృతుల్లో ఐదుగురు మహిళలు, ఒక పురుషుడు ఉన్నారు. బస్సు ముందు భాగం తీవ్రంగా దెబ్బతినడంతో సుమారు 15నుంచి 23మంది ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల సమాచారంతో పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను హుటాహుటిన కోదాడ ప్రభుత్వాసుపత్రితో పాటు సమీపంలోని ఇతర ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

ఈ ఘటనతో హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడి, భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. రంగంలోకి దిగిన పోలీసులు రోడ్డుపై ఉన్న వాహనాలను పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. అతివేగం, డ్రైవర్ నిర్లక్ష్యమే ఈ ప్రమాదానికి కారణమా లేక ఆగి ఉన్న లారీని ఢీకొట్టారా అనే కోణంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుల గుర్తింపు, ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు అందాల్సి ఉంది.






# తెలంగాణలో ఖేలో ఇండియా

**ముద్ర, హైదరాబాద్ :**
తెలంగాణలో ఈ ఏడాది 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్' నిర్వహించనున్నారు. హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్ నగరాలు ఈ ప్రతిష్ఠాత్మక క్రీడలకు వేదికలు కానున్నాయి. మొత్తం 25 క్రీడాంశాల్లో పోటీలు జరగనుండగా.. దేశవ్యాప్తంగా సుమారు 6 వేల మంది యువ క్రీడాకారులు పాల్గొననున్నారు. పోటీల నిర్వహణ కోసం కేంద్ర ప్రభుత్వం రూ.22 కోట్ల నిధులను విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వం, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సహా పలు క్రీడా సంస్థల సమన్వయంతో ఈ పోటీలను నిర్వహించనున్నారు. ఆతిథ్య రాష్ట్రంగా తెలంగాణ ఒక స్థానిక క్రీడను ప్రతిపాదించడంతో పాటు మరో కొత్త క్రీడను కూడా పోటీల్లో చేర్చే అవకాశం ఉంది.

తెలంగాణకు ఖేలో ఇండియా యూత్ గేమ్స్ కేటాయించడంపై కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణలో ఇప్పటికే ఖేలో ఇండియా పథకం కింద సుమారు రూ.30 కోట్లతో క్రీడా మౌలిక వసతులు అభి వృద్ధి చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో 33 ఖేలో ఇండియా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

ఇక క్రీడా ప్రతిభను వెలికితీయడంలో ఖేలో ఇండియా, టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీం వంటి కేంద్ర పథకాలు కీలకంగా మారుతున్నాయని కేంద్రం చెబుతోంది. నిఖత్ జరీన్, పీవీ సింధు వంటి క్రీడాకారులకు ఈ పథకాల ద్వారా శిక్షణ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనే అవకాశాలు లభించాయని పేర్కొంది.

మరోవైపు ఆగస్టు 29న జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 27న 'ఖేల్ కీ బాత్, పీఎం కే సాథ్' కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. దేశవ్యాప్తంగా 1,500కు పైగా కళాశాలల్లో జరిగే ఈ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ యువతతో వర్చువల్ గా ముచ్చటించనున్నారు. క్రీడలు, ఫిట్‌నెస్ తో పాటు దేశ నిర్మాణంలో యువత పాత్రపై వారితో చర్చించనున్నారు.

### కృతి యాడ్‌పై

# పొలిటికల్ వార్

**ముద్ర ఢిల్లీ :**
రక్షాబంధన్ సందర్భంగా నటి కృతి సనన్ నటించిన ఓ నగల ప్రకటనపై మొదలైన వివాదం ఇప్పుడు రాజకీయ రంగు పులుముకుంది. కృతి దుస్తులపై వచ్చిన విమర్శలకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందిస్తూ.. మహిళలు ఏం ధరించాలి, ఏం చేయాలి, ఎక్కడికి వెళ్లాలి అనేది వారి వ్యక్తిగత స్వేచ్ఛ అంటూ 'స్మాష్ ద ప్యాట్రియార్కీ' హ్యాష్‌ట్యాగ్‌తో కృతికి మద్దతు తెలిపారు.

రాహుల్ వ్యాఖ్యలకు బీజేపీ ఎంపీ, నటి కంగనా రనౌత్ తనదైన శైలిలో కౌంటర్ ఇచ్చారు. "బ్రో.. కాస్త ఆగండి. భారత్ మాతాకీ జై.. ప్రారంభిద్దాం" అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. అనంతరం మహిళా బిల్లు, ట్రిపుల్ తలాక్ అంశాలను ప్రస్తావిస్తూ రాహుల్‌ను ప్రశ్నించేలా ఉన్న పోస్టులను కూడా షేర్ చేశారు. ఇక అసలు వివాదం కృతి సనన్ నటించిన 32 సెకండ్ల రక్షాబంధన్ యాడ్‌తో మొదలైంది. అందులో కృతి ఆధునిక దుస్తుల్లో కనిపించడంతో కొందరు సోషల్ మీడియాలో అభ్యంతరం వ్యక్తం చేశారు. అంతేకాదు, తన సోదరుడితో పాటు పెంపుడు కుక్కకు కూడా రాఖీ కట్టే సన్నివేశంపైనా విమర్శలున్నాయి. ఈ వివాదంపై కంగనా కూడా స్పందిస్తూ.. రక్షాబంధన్ వంటి సంప్రదాయ పండుగను యాడ్‌లో చూపించిన తీరుపై అభ్యంతరం వ్యక్తం చేశారు. అయితే కృతి మాత్రం ఘాటుగా బదులిచ్చారు. ఒక మహిళ సంస్కృతి, సంప్రదాయాలను ఆమె దుస్తులతోనే ఎందుకు అంచనా వేయాలని ప్రశ్నించారు. రక్షాబంధన్ అనేది ప్రేమ, పరస్పర రక్షణకు ప్రతీక అని స్పష్టం చేశారు.

కృతి వ్యాఖ్యలను రాహుల్ గాంధీ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో షేర్ చేస్తూ మహిళల దుస్తులు, జీవనశైలిపై ట్రోలింగ్ చేయొద్దని పేర్కొన్నారు. దీంతో రంగంలోకి దిగిన కంగనా.. "భారత్ మాతాకీ జై" అంటూ రాహుల్‌కు కౌంటర్ ఇవ్వడంతో ఈ వివాదం మరోసారి రాజకీయ చర్చకు దారితీసింది.

# కాంగ్రెస్ లో వరుస భేటీలు

(మొదటి పేజీ తరువాయి)
రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీపై గౌరవం, పూర్తి విశ్వాసం ఉందని కొండా మురళి తెలిపారు. తాము 100 శాతం కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతామని స్పష్టం చేశారు. భట్టి విక్రమార్కను ఒక బిల్లు విషయమై కలిశానని.. ఈ సమావేశంలో కొండా సురేఖ, కొండా సుస్మిత వ్యవహారంపై చర్చించలేదని తేల్చి చెప్పారు.

మరోవైపు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కూడా భట్టి విక్రమార్కతో సమావేశం కావడం ఇప్పుడు రాజకీయంగా తీవ్ర చర్చకు దారితీసింది. తాజా పరిణామాల నేపథ్యంలో ఆయన భేటీకి కారణాలపై కాంగ్రెస్ వర్గాల్లో రకరకాల ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అయితే ఈ సమావేశంలో ఏ అంశాలపై చర్చ జరిగిందనే దానిపై అధికారికంగా ఎలాంటి వివరాలు వెల్లడికాలేదు. కొండా సురేఖ, చిన్నారెడ్డిపై క్రమశిక్షణ కమిటీ నివేదిక ఇప్పటికే పీసీసీ అధ్యక్షుడికి చేరిన నేపథ్యంలోతదుపరి చర్యలపై కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఈ పరిణామాల మధ్య కీలక నేతల వరుస భేటీలు తెలంగాణ కాంగ్రెస్‌లో మరింత ఉత్కంఠను పెంచుతున్నాయి.







# ఇన్వెస్ట్ తెలంగాణ

(మొదటి పేజీ తరువాయి)
అధికారులు పాల్గొన్నారు. సీనియర్ అధికారి ఆధ్వర్యంలో ఈ వార్ రూమ్ పర్యవేక్షణ బాధ్యతలను సీఎస్ పటిష్టం చేయాలన్నారు.

సమ్మిట్ కోసం ఏర్పాటు చేసిన వివిధ కమిటీలలో అవసరమైన నిపుణులను కీలక అధికారులను తీసుకోవలని ఆయన చెప్పారు. గతంలో జరిగిన గ్లోబల్ సమ్మిట్ సందర్భంగా కుదుర్చుకున్న అవగాహన ఒప్పందాల ప్రస్తుత పురోగతిపై సమగ్ర విశ్లేషణ చేసేందుకు ప్రత్యేకంగా కమిటీకి బాధ్యతలు అప్పగించాలన్నారు. డిసెంబర్ లో జరగనున్న సమ్మిట్ కోసం దేశీయంగా, అంతర్జాతీయంగా విస్తృతంగా రోడ్ షోలు నిర్వహించి పెట్టుబడిదారులను ఆకర్షించాలని చెప్పారు.




ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ కోసం అతిథులకు ఆహ్వాన పత్రాలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా త్వరగా పంపించే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల లాటరీకి డేట్ ఫిక్స్

(మొదటి పేజీ తరువాయి)
మధ్యవర్తుల ప్రమేయానికి ఆస్కారం లేదని అధికారులు స్పష్టం చేశారు. 'ఇండ్లు ఇప్పిస్తాం' అంటూ డబ్బులు వసూలు చేసే దళారుల మాటలను నమ్మి ప్రజలు మోసపోవద్దని హౌసింగ్ బోర్డు విజ్ఞప్తి చేసింది. కేవలం అర్హత కలిగిన దరఖాస్తుదారులకు మాత్రమే లాటరీ పద్ధతి ద్వారా పూర్తి పారదర్శకతతో ఇండ్ల కేటాయింపు జరుగుతుందని స్పష్టం చేశారు.



అర్హులందరికీ తదుపరి విడతల్లో అవకాశం ఒకవేళ ఈ విడత లాటరీలో పేరు రాకపోయినప్పటికీ అర్హులైన లబ్ధిదారులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వీపీ గౌతం తెలిపారు. ప్రస్తుతం చేపడుతున్న ఇందిరమ్మ టవర్స్ కేవలం పైలట్ ప్రాజెక్ట్ మాత్రమేనని, భవిష్యత్తులో నిర్మించే తదుపరి విడత టవర్లలో మళ్లీ దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. నగరం పరిధిలో మొత్తం లక్ష ఇండ్లను నిర్మించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని వివరించారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
గురువారం 27.08.2026
www.mudranews.in | @mudranews



## రాగి వాటర్ బాటిల్.. పరిమితంగానే!

రాగి బాటిల్‌ను ఎక్కువగా ఉపయోగించకుండా పరిమితంగా వాడటం మంచిది. రాగి నీటిలోకి కొంత కాపర్ చేరవచ్చు. అయితే అధికంగా తీసుకోవడం ఆరోగ్యానికి హానికరం కావచ్చు. ముఖ్యంగా నిమ్మరసం, పాలు వంటి ఆమ్ల పదార్థాలను రాగి బాటిల్‌లో నిల్వ చేయకూడదు.




# ఓనం వేడుకలు భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతిరూపం

**- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**



ముద్ర, హైదరాబాద్:

కేరళ సాంస్కృతిక వారసత్వం, సంప్రదాయాలను ప్రతిబింబించే ఓనం వేడుకలు కళారూపాలు, ఆచార సంప్రదాయాలతో భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతిరూపంగా నిలుస్తాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రకృతికి కృతజ్ఞత చాటడంతో పాటు సోదరభావం, కుటుంబ సభ్యులు, స్నేహితులు, ఆత్మీయులతో కలిసి ఆనందాన్ని పంచుకునే స్ఫూర్తిని ఓనం అందిస్తుందని తెలిపారు.

ఓనం పర్వదినం ప్రతి ఇంటా ఆనందం, శాంతి, సౌభాగ్యాలను నింపాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. ఈ పండుగ ప్రజల మధ్య ఐక్యత, సోదరభావాన్ని మరింత బలోపేతం చేయాలని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు.

# మీ సేవా కేంద్రాలే డిజిటల్ మార్కెటింగ్ హబ్ లు

**- మెటాతో కలిసి వీఎల్ఈలకు ప్రత్యేక శిక్షణ**

**- కొత్త పోర్టల్, టోల్‌ఫ్రీ సేవలను ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు**

ముద్ర, హైదరాబాద్, ఆగస్టు 26:

తెలంగాణలోని ప్రతి మీ సేవా కేంద్రాన్ని డిజిటల్ మార్కెటింగ్ హబ్‌గా తీర్చిదిద్దనున్నట్లు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. స్థానిక వ్యాపారులకు తక్కువ ఖర్చుతో డిజిటల్ ప్రచార అవకాశాలను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా మీ సేవా–మెటా సంయుక్త కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్ గచ్చిబౌలిలోని షెరటాన్ హోటల్‌లో బుధవారం మీ సేవా డిజిటల్ మార్కెటింగ్ శిక్షణ రెండో దశ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 140 మందికి పైగా మీ సేవా విలేజ్ లెవల్ ఎంటర్‌ప్రెన్యూర్లు (వీఎల్ఈలు) హాజరయ్యారు. వీరికి 'డిజిటల్ బిజినెస్ అంబాసిడర్లుగా' ప్రత్యేక శిక్షణ అందించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. కొత్త సాంకేతికతను స్వీకరించడంలో తెలంగాణ ఎప్పుడూ ముందుంటుందని అన్నారు. సమర్థవంతమైన పౌర సేవలందించడంలో రాష్ట్రం ప్రత్యేక గుర్తింపు సాధించిందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 5 వేలకుపైగా మీ సేవా కేంద్రాలు ఉన్నాయని, వీటి ద్వారా స్వీట్ షాపులు, టెక్స్‌టైల్ స్టోర్లు, నైపుణ్య వృత్తిదారులు, ఇతర చిన్న వ్యాపారులకు డిజిటల్ మార్కెటింగ్ అవకాశాలను చేరువ చేయవచ్చని చెప్పారు. మీ సేవా కేంద్రాలు కేవలం పౌర సేవలకే పరిమితం కాకుండా ప్రజలకు డిజిటల్ అవగాహన కల్పించే, ఆదాయ అవకాశాలను పెంచే వేదికలుగా మారాలని మంత్రి ఆకాంక్షించారు. డిజిటల్ మార్కెటింగ్ ద్వారా చిన్న వ్యాపారులు తమ ఆదాయాన్ని పెంచుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రజల ఆదాయం పెరగడంతో పాటు దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు.




### పైలట్ ప్రాజెక్టుకు మంచి స్పందన

ఈ కార్యక్రమాన్ని తొలుత హైదరాబాద్‌లో జీహెచ్ఎంసీ/క్యూర్ పరిధిలో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టారు. సుమారు 120 మంది మీ సేవా వీఎల్ఈలకు డిజిటల్ మార్కెటింగ్, సోషల్ మీడియా ప్రకటనలపై శిక్షణ ఇచ్చారు. వీరిలో 10 మందికిపైగా ఇప్పటికే ప్రత్యక్షంగా డిజిటల్ ప్రకటనల ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. స్థానిక వ్యాపారుల కోసం ఇప్పటివరకు 17కుపైగా ప్రకటనలను రూపొందించి ప్రచురించారు. దీంతో వీఎల్ఈలకు కొత్త ఆదాయ మార్గం ఏర్పడటంతో పాటు స్థానిక వ్యాపారులకు వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి వేదికల్లో తక్కువ వ్యయంతో తమ ఉత్పత్తులు, సేవలను ప్రచారం చేసుకునే అవకాశం లభించింది.

### అన్ని జిల్లాలకు విస్తరణ

తొలి దశలో వచ్చిన ఫలితాల నేపథ్యంలో కార్యక్రమాన్ని రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు విస్తరిస్తున్నారు. రెండో దశలో ప్రతి జిల్లా నుంచి నలుగురు నుంచి ఐదుగురు చొప్పున వీఎల్ఈలను ఎంపిక చేశారు. డిజిటల్ మార్కెటింగ్‌పై ప్రాథమిక అవగాహన, ఆసక్తి, స్థానిక వ్యాపారులతో సమర్థంగా సంప్రదించే సామర్థ్యాన్ని పరిగణనలోకి తీసుకుని ఎంపిక చేపట్టారు. శిక్షణ పొందిన వీఎల్ఈలు తమ జిల్లాల్లో 'డిజిటల్ బిజినెస్ అంబాసిడర్లుగా' పనిచేస్తారు. స్థానిక వ్యాపార అవసరాలను గుర్తించడం, డిజిటల్ మార్కెటింగ్ ప్రయోజనాలను వివరించడం, ప్రకటనల రూపకల్పనలో సహకరించడం, లక్ష్య వినియోగదారులను గుర్తించడం వంటి సేవలను అందిస్తారు. వ్యాపార విస్తరణలోనూ నిరంతర సహకారం అందించనున్నారు.

### మెటాతో అవగాహన ఒప్పందం

కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ (ఈఎస్‌డీ), ఐటీ అండ్ సీ శాఖ, మెటా సంస్థల మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. దీంతో మీ సేవా డిజిటల్ మార్కెటింగ్ కార్యక్రమంలో ఇరు సంస్థల భాగస్వామ్యం అధికారికంగా ప్రారంభమైంది.

### కొత్త పోర్టల్, హెల్ప్‌లైన్ ప్రారంభం

స్థానిక వ్యాపారులు మీ సేవా ద్వారా నేరుగా డిజిటల్ మార్కెటింగ్ సహాయం కోరేలా కొత్త సదుపాయాన్ని మంత్రి శ్రీధర్‌బాబు ప్రారంభించారు. వ్యాపారులకు అందుబాటు ధరల్లో డిజిటల్ మార్కెటింగ్ సేవలు అందించడమే దీని లక్ష్యం.

పోర్టల్: meeseva.telangana.gov.in
టోల్‌ఫ్రీ: 1100 / 1800-425-1110

ఈ సేవ ద్వారా వినియోగదారులు తమ ప్రాంతంలోని ఉత్పత్తులు, సేవలను సులభంగా గుర్తించే అవకాశం కలుగుతుందని అధికారులు తెలిపారు. వీఎల్ఈలకు అదనపు ఆదాయ మార్గం ఏర్పడటంతో పాటు రాష్ట్రంలో డిజిటల్ వ్యాపార వ్యవస్థ మరింత బలోపేతం కానుందని పేర్కొన్నారు.

శిక్షణ పొందిన ప్రతి వీఎల్ఈ తొలుత ఒక వ్యాపారంతో సేవలు ప్రారంభించి, అనంతరం పది, వంద వ్యాపారాలకు విస్తరించేలా ముందుకు సాగాలని ప్రభుత్వం సూచించింది. ప్రతి జిల్లాలో శిక్షణ పొందిన డిజిటల్ మార్కెటింగ్ వీఎల్ఈలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపింది.

ఈ కార్యక్రమంలో మీ సేవా కమిషనర్, ఈఎస్‌డీ అధికారి టి. రవికిరణ్, ఐఎఫ్ఎస్, మెటా మేనేజింగ్ డైరెక్టర్, కంట్రీ హెడ్ అరుణ్ శ్రీనివాస్, స్ట్రాటజిక్ ప్రోగ్రామ్స్ అండ్ పార్ట్‌నర్‌షిప్స్ హెడ్ దివ్య ఖేమాని వధేరా, మీడియా, ట్రావెల్ అండ్ సర్వీసెస్ ఎకోసిస్టమ్ వర్టికల్ హెడ్ రిషాద్ చిందమడ తదితరులు పాల్గొన్నారు.

# పెట్టుబడులను ఆకర్షించేలా ఇన్వెస్ట్ తెలంగాణ

**- నిపుణులతో కమిటీల ఏర్పాటు**

**- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**

ముద్ర, హైదరాబాద్:

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2026–ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ నిర్వహణలో భాగంగా ప్రజాభవన్‌లో తక్షణమే ప్రత్యేక వార్ రూమ్‌ను ఏర్పాటు చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ కోసం అతిథులకు ఆహ్వాన పత్రాలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా త్వరగా పంపించే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. బుధవారం మహాత్మా పూలే ప్రజాభవన్ లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘం సమావేశమైంది. ఈ సమావేశంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సహా పలువురు అధికారులు పాల్గొన్నారు. సీనియర్ అధికారి ఆధ్వర్యంలో ఈ వార్ రూమ్ పర్యవేక్షణ బాధ్యతలను సీఎస్ పటిష్టం చేయాలని సూచించారు.

సమ్మిట్ కోసం ఏర్పాటు చేసిన వివిధ కమిటీలలో అవసరమైన నిపుణులను కీలక అధికారులను తీసుకోవలని ఆయన చెప్పారు. గతంలో జరిగిన గ్లోబల్ సమ్మిట్ సందర్భంగా కుదుర్చుకున్న అవగాహన ఒప్పందాల ప్రస్తుత పురోగతిపై సమగ్ర విశ్లేషణ చేసేందుకు ప్రత్యేకంగా కమిటీకి బాధ్యతలు అప్పగించాలన్నారు. డిసెంబర్ లో జరగనున్న సమ్మిట్ కోసం దేశీయంగా, అంతర్జాతీయంగా విస్తృతంగా రోడ్ షోలు నిర్వహించి పెట్టుబడిదారులను



ఆకర్షించాలని చెప్పారు. ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ కోసం అతిథులకు ఆహ్వాన పత్రాలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా త్వరగా పంపించే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. సమ్మిట్ పనుల పురోగతిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రోజుకు కనీసం ఒక గంట కేటాయించి రోజు వారీ సమీక్షలు నిర్వహించాలని, ప్రతి కమిటీకి కేటాయించిన బాధ్యతలను టైమ్‌లైన్ ప్రకారం పూర్తి చేయాలని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు.

### బొగ్గు నుంచి కీలక ఖనిజాల దిశగా సింగరేణి

తెలంగాణ రాష్ట్రానికి గుండెకాయవంటి ప్రభుత్వరంగ సంస్థ అయిన సింగరేణిని లాభదాయక సంస్థగా నిలబెట్టి భవిష్యత్ తరాలకు అందించడమే తమ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. బొగ్గు తవ్వకాలతో పాటుగా కీలక, వ్యూహాత్మక ఖనిజాల అన్వేషణ చేయాలని ఆయన అధికారులకు సూచించారు. క్రిటికల్ మినరల్స్, బొగ్గు గనులకు సంబంధించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జరిగే అన్ని వేలం ప్రక్రియల్లో పాల్గొనాలని ఆయన అధికారులకు చెప్పారు. బుధవారం ఉదయం మహాత్మా జ్యోతీరావు పూలే ప్రజాభవన్ లో సింగరేణి అధికారులతో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సుదీర్ఘంగా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి, డైరెక్టర్లు సూర్యనారాయణ, వెంకటేశ్వర్లు, తిరుమలరావు సహా పలువురు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం వల్ల విద్యుత్ అవసరాలు పెరిగిన నేపథ్యంలో సింగరేణి డిమాండ్ కు తగ్గట్టుగా బొగ్గు ఉత్పత్తిని పెంచాలని అధికారులకు సూచించారు. సింగరేణి కేవలం బొగ్గు మైనింగ్ కే కాకుండా అన్ని రకాల మైనింగ్ లోకి ప్రవేశించాలని ఆయన అధికారులకు చెప్పారు. ఇందుకు ప్రజాప్రభుత్వం అన్ని రకాలుగా సహకారం అందిస్తుందని అన్నారు. రానున్న కాలంలో వెనిడీయం, టైటానియం లాంటి ఖనిజాల బ్లాక్ లు వేలంలోకి వస్తున్న తరుణంలో వాటిని దక్కించుకునేందుకు సమగ్ర కార్యాచరణతో ముందుకు వెళ్లాలని ఆయన అధికారులకు చెప్పారు. రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఇంధన భద్రత విషయంలో సింగరేణి తన పాత్రనే మరింత గా పోషించాలని ఆయన చెప్పారు.

ప్రపంచ మార్పులకు అనుగుణంగా కాపర్, గ్రాఫైట్, లిథియం, కోబాల్ట్ వంటి కీలక ఖనిజాలు మైనింగ్ వైపు సింగరేణిని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. అంతర్జాతీయ అవకాశాలను అధ్యయనం చేసేందుకు సౌత్ ఆఫ్రికా, బ్రెజిల్, ఆస్ట్రేలియా, చిలీ వంటి దేశాల కోసం అంతర్జాతీయ కన్సల్టెంట్లను నియమించామని డిప్యూటీ సీఎం చెప్పారు.

# కేంద్రం సహకరించకపోయినా పేదల సొంతింటి కలను సాకారం చేస్తాం

**- మార్చి 31 వరకు పూర్తయిన ఇందిరమ్మ ఇళ్ల చివరి బిల్లులను రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తుంది**

**- రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కష్టంగా ఉన్నా పేదల కోసం రూ.185 కోట్లు విడుదల చేశాం**

**- 15,475 మంది లబ్ధిదారుల ఖాతాల్లో చివరి బిల్లులు జమ చేశా**

**- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

ముద్ర, హైదరాబాద్ , ఆగస్టు 26:

హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం సహకరించకపోయినా తెలంగాణ ప్రజా ప్రభుత్వం పేదవాడి సొంతింటి కలను సాకారం చేయడంలో వెనక్కి తగ్గదని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు సహకరించకపోయినా పేదల కోసం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను కొనసాగిస్తున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధుల కోసం ఏడాదిగా ఎదురుచూశామని, పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ ఇప్పటివరకు కేంద్రం నుంచి ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను పలుమార్లు కలిసి తెలంగాణకు ఇళ్లు మంజూరు చేయాలని కోరారని తెలిపారు. కేంద్రం నుంచి నిధులు వస్తాయన్న ఆశతో ఇప్పటివరకు పూర్తయిన ఇళ్లకు సంబంధించిన చివరి బిల్లుల చెల్లింపులను తాత్కాలికంగా నిలిపివేశామని మంత్రి చెప్పారు. అయితే పేద లబ్ధిదారులను ఇకపై ఇబ్బంది పెట్టకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వమే నిధులు సమకూర్చి చెల్లింపులు చేపట్టిందన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకున్న 15,475 మంది లబ్ధిదారులకు రూ.185 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందని పొంగులేటి వెల్లడించారు. మార్చి 31వ తేదీ వరకు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న అర్హులైన లబ్ధిదారులకు చివరి బిల్లుల మొత్తాన్ని గురువారం వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారు. మిగిలిన లబ్ధిదారులకు కూడా విడతల వారీగా చెల్లింపులు చేస్తామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. దేశంలో మరే రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వని విధంగా ఇందిరమ్మ ఇంటికి రూ.5 లక్షల పూర్తి సబ్సిడీ అందిస్తూ తెలంగాణ ప్రభుత్వం పథకాన్ని అమలు చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. పేద కుటుంబాలకు సురక్షితమైన, గౌరవప్రదమైన నివాసం కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో గృహ నిర్మాణానికి తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని మంత్రి విమర్శించారు. 2014 నుంచి 2023 వరకు దాదాపు పదేళ్ల కాలంలో ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పేదల ఇళ్ల నిర్మాణం ఆశించిన స్థాయిలో జరగలేదన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో పేదల ఇళ్ల నిర్మాణానికి భారీగా డిమాండ్ ఉందని, ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని చెప్పారు. గత ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయగా, ఇప్పటివరకు సుమారు 2 లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని మంత్రి తెలిపారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జూన్ 2న ఆదిలాబాద్‌లో ప్రారంభించారని, సెప్టెంబర్ 15లోగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తి చేస్తామని వెల్లడించారు.



కేంద్రం తన బాధ్యతను నిర్వర్తించకపోయినా పేదల పట్ల రాష్ట్ర ప్రభుత్వం తన బాధ్యతను నిర్వర్తిస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. పేదల సొంతింటి కలను నెరవేర్చడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన సంకల్పమని, ఈ లక్ష్య సాధనలో కేంద్రం సానుకూలంగా స్పందిస్తుందనే ఆశాభావం ఇప్పటికీ ఉందని తెలిపారు.

# ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ లాటరీకి ముహూర్తం..

**- 28 నుంచి 31 వరకు డ్రా**

**- హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ వి.పి గౌతం**

ముద్ర, హైదరాబాద్:

ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ పథకంలో భాగంగా హైదరాబాద్ పరిధిలో నిర్మించనున్న ఇళ్ల కేటాయింపునకు లాటరీ ప్రక్రియ ఈ నెల 28 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ వి.పి. గౌతం తెలిపారు. 16 అసెంబ్లీ నియోజకవర్గాలకు నాలుగు రోజుల పాటు, రోజుకు నాలుగు నియోజకవర్గాల చొప్పున లాటరీ డ్రా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. లాటరీ ప్రక్రియను యూ ట్యూబ్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేస్తామని, ఎలాంటి అనుమానాలు, అపోహలకు తావులేకుండా పూర్తి పారదర్శకంగా డ్రా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని గౌతం తెలిపారు. స్థలాభావం, భద్రతా కారణాల దృష్ట్యా లాటరీ కేంద్రాల్లోకి దరఖాస్తుదారులందరినీ అనుమతించలేమని, అయితే కేంద్రాల వద్ద ఏర్పాటు చేసే స్క్రీన్లపై లాటరీ ప్రక్రియను వీక్షించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. లాటరీ ప్రత్యక్ష ప్రసారాన్ని tghb.telangana.gov.in వెబ్‌సైట్‌తో పాటు హౌసింగ్ డిపార్ట్‌మెంట్ సోషల్ మీడియా ఖాతాల ద్వారా వీక్షించవచ్చని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ పథకం కింద ఇళ్ల కోసం ఈ నెల 15 వరకు దరఖాస్తులను స్వీకరించినట్లు గౌతం చెప్పారు. అందిన దరఖాస్తులన్నింటినీ పరిశీలించడంతో పాటు అనర్హులుగా గుర్తించిన దరఖాస్తుదారుల నుంచి అభ్యంతరాలను స్వీకరించి పరిష్కరించినట్లు వెల్లడించారు.

### లాటరీ షెడ్యూల్

**ఆగస్టు 28:** కుత్బుల్లాపూర్, సికింద్రాబాద్ కంటోన్మెంట్, రాజేంద్రనగర్, నాంపల్లి నియోజకవర్గాలకు లాటరీ నిర్వహిస్తారు. గాజులరామారం గండిమైసమ్మ ఫంక్షన్ హాల్,



బోయినపల్లిలోని మల్లారెడ్డి గార్డెన్స్, మైలార్‌దేవ్‌పల్లిలోని లక్ష్మీగుడ పొదుపు సంఘం హాల్, రెడ్‌హిల్స్‌లోని వెట్స్ గార్డెన్ కేంద్రాలుగా ఉంటాయి.

**ఆగస్టు 29:** ఖైరతాబాద్, కూకట్‌పల్లి, అంబర్‌పేట, బహదూర్‌పుర నియోజకవర్గాలకు లాటరీ నిర్వహిస్తారు.ఆయా నియోజకవర్గాలకు కుమ్రంభీం ఆదివాసీ భవన్–సేవాలాల్ బంజారా భవన్, కేపీహెచ్‌బీ కమ్యూనిటీ హాల్, మహారాణా ప్రతాప్ ఫంక్షన్ హాల్, ఎస్‌డీఆర్ పెర్ల్ ప్యాలెస్ కేంద్రాలుగా ఉంటాయి.

**ఆగస్టు 30:** శేరిలింగంపల్లి, మలక్‌పేట, ఇబ్రహీంపట్నం, మేడ్చల్ నియోజకవర్గాలకు లాటరీ నిర్వహిస్తారు. గచ్చిబౌలిలోని నిర్మిత కేంద్ర ప్రాంగణం, చంపాపేటలోని సాదియా ఫంక్షన్ హాల్, బండ్లగూడ రాజీవ్ స్వగృహ కమ్యూనిటీ హాల్, పోచారం స్వగృహ కమ్యూనిటీ హాళ్లలో ఈ ప్రక్రియ జరుగుతుంది.

**ఆగస్టు 31:** మల్కాజిగిరి, సనత్‌నగర్, మహేశ్వరం, కార్వాన్ నియోజకవరాలకు లాటరీ నిర్వహిస్తారు. ఆల్వాల్‌లోని వీఎన్ఆర్ గారెన్స్, పాటిగడ్డలోని హెవన్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్, బడంగ్‌పేట్ ప్రజాభవన్ కేంద్రాలుగా ఉంటాయి. కుల్సుంపుర ప్రాజెక్టుకు సంబంధించిన లాటరీ కేంద్ర వివరాలను అధికారులు ప్రకటించాల్సి ఉంది.

### దళారీలకు ఆస్కారం లేదు

ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ పథకంలో సిఫారసులు, మధ్యవర్తుల ప్రమేయానికి ఎలాంటి అవకాశం లేదని వి.పి. గౌతం స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా పూర్తి పారదర్శకంగా ఫ్లాట్ల కేటాయింపు జరుగుతుందని తెలిపారు.

లాటరీలో పేరు రాకపోయినా అర్హతలు ఉన్న దరఖాస్తుదారులు నిరాశ చెందాల్సిన అవసరం లేదన్నారు. తదుపరి విడతలో నిర్మించే టవర్స్‌కు వారు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. ప్రస్తుతం చేపడుతున్న నిర్మాణాలు పైలట్ ప్రాజెక్టులేనని, మొత్తంగా లక్ష ఇళ్లను నిర్మించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు.

అనర్హులైన దరఖాస్తుదారులు ప్రభుత్వం త్వరలో ప్రకటించనున్న ఎంఐజీ హౌసింగ్ పథకంలో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. అన్ని వర్గాల ప్రజలకు సొంత ఇళ్లు కల్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. లాటరీలో ఇళ్లు రాకపోయినా తాము ఇళ్లు ఇప్పిస్తామంటూ కొందరు మధ్యవర్తులు చేస్తున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని గౌతం స్పష్టం చేశారు. ఇలాంటి ఆధారరహిత ప్రచారాలను నమ్మవద్దని, ఇళ్ల కేటాయింపు కోసం ఎవరినీ ఆశ్రయించవద్దని సూచించారు.

ఇళ్లను ఇప్పిస్తామని ఎవరైనా డబ్బులు లేదా ఇతర ప్రయోజనాలు కోరితే నమ్మవద్దని తెలిపారు. అర్హులైన దరఖాస్తుదారులకే పూర్తి పారదర్శకంగా ఇళ్లను కేటాయిస్తామని స్పష్టం చేశారు. సందేహాల నివృత్తి కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక కాల్ సెంటర్ 040-24603572కు ఫోన్ చేయవచ్చని, మధ్యవర్తులు లేదా అక్రమాలకు సంబంధించిన సమాచారం ఉంటే అదే నంబర్‌కు తెలియజేయాలని గౌతం విజ్ఞప్తి చేశారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
గురువారం 27.08.2026



నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిననేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

# ఆలస్యం అవుతున్న వివాహాలు

## మారుతున్న సమాజం, పెరుగుతున్న అంచనాలు

వివాహం అనేది ఇద్దరు వ్యక్తుల కలయిక మాత్రమే కాదు.. రెండు మనసులు, రెండు కుటుంబాలు, రెండు జీవన విధానాలు ఒకరినొకరు అర్థం చేసుకుంటూ కలిసి నడిచే జీవిత ప్రయాణం. అయితే నేటి సమాజంలో వివాహాల వయస్సు పెరగడం, సంబంధాల విషయంలో అంచనాలు పెరగడం, చిన్న చిన్న విషయాలకే సంబంధాలు తిరస్కరించడం వంటి పరిణామాలు కొత్త సామాజిక సమస్యలకు దారితీస్తున్నాయి.



ఒకప్పుడు వివాహం అనేది జీవితంలో సహజమైన తదుపరి దశగా భావించేవారు. చదువు పూర్తయిన తర్వాత ఉద్యోగం, ఆ తర్వాత వివాహం, కుటుంబ జీవితం, పిల్లలు–ఇలా జీవితం ఒక క్రమంలో సాగేది. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ బలంగా ఉండటం, పెద్దల మాటకు విలువ ఉండటం, కుటుంబ బాధ్యతలను చిన్న వయస్సులోనే స్వీకరించడం అప్పటి జీవన విధానంలో భాగంగా ఉండేది.

అయితే కాలం మారింది. విద్యావకాశాలు పెరిగాయి. ముఖ్యంగా మహిళలు ఉన్నత విద్యను అభ్యసించి ఉద్యోగాలు, వృత్తుల్లో ముందుకు రావడం ప్రారంభించారు. పురుషులు కూడా కెరీర్‌లో స్థిరపడటానికి ఎక్కువ సమయం కేటాయిస్తున్నారు. ఆర్థిక స్వాతంత్ర్యం, వ్యక్తిగత స్వేచ్ఛ, స్వీయ నిర్ణయ హక్కు, నగర జీవనం, ప్రపంచవ్యాప్త అవకాశాలు–ఇవన్నీ వివాహ నిర్ణయాలను ప్రభావితం చేస్తున్నాయి.

వివాహం కంటే ముందుగా కెరీర్‌నా? లేక కెరీర్‌తో పాటు వివాహాన్నీ సమతుల్యం చేయాలా? అనే ప్రశ్న ముందుంది.

### వివాహం ఎందుకు ఆలస్యమవుతోంది?

వివాహాలు ఆలస్యం కావడానికి ఒక్క కారణం ఉండదు. ప్రతి వ్యక్తి పరిస్థితి భిన్నంగా ఉంటుంది. ఉన్నత విద్య, ఉద్యోగ స్థిరత్వం, ఆర్థిక భద్రత, సరైన జీవిత భాగస్వామి కోసం ఎదురుచూపు, కుటుంబ బాధ్యతలు, వ్యక్తిగత లక్ష్యాలు, నగర జీవనశైలి వంటి అనేక కారణాలు ఇందులో భాగమవుతున్నాయి.

కొంతమంది యువతీయువకులు ముందుగా తమ కెరీర్‌ను నిర్మించుకోవాలని భావిస్తున్నారు. చదువు పూర్తయ్యే సమయానికి వయస్సు పెరుగుతుంది. ఆ తర్వాత ఉద్యోగం, ఉద్యోగంలో స్థిరత్వం, మంచి ఆదాయం, సొంత ఇల్లు వంటి లక్ష్యాలు ముందుకు వస్తాయి. ఈ లక్ష్యాలన్నీ పూర్తయ్యేలోపు వివాహ వయస్సు ముందుకు వెళ్తుంది. మరో వైపు, 'ఇంకాస్త మంచి సంబంధం దొరకవచ్చు' అనే ఆలోచన కూడా సంబంధాల ఎంపికను అంతులేని ప్రక్రియగా మార్చుతోంది.

### అంచనాలు అవసరమే.. కానీ హద్దులు

జీవిత భాగస్వామిని ఎన్నుకునేటప్పుడు కొన్ని అంచనాలు ఉండటం సహజం. చెడు అలవాట్లు లేకపోవడం, బాధ్యతగా ఉండటం, మంచి స్వభావం కలిగి ఉండటం, కుటుంబాన్ని గౌరవించడం, ఆర్థికంగా స్థిరంగా ఉండటం వంటి అంశాలు ముఖ్యమైనవే.

### సమస్య ఎప్పుడు మొదలవుతుంది..

మంచి ఉద్యోగం ఉండాలి...
అధిక జీతం ఉండాలి...
సొంత ఇల్లు ఉండాలి..
కారు ఉండాలి..
పట్టణంలోనే ఉద్యోగం ఉండాలి..
తమకు నచ్చిన ప్రాంతంలోనే ఉండాలి..
అత్తమామల జోక్యం ఉండకూడదు..
అమ్మాయి ఉద్యోగం చేస్తే ఇంటి బాధ్యతలు కూడా సమర్థంగా నిర్వహించాలి..
అబ్బాయి సంపాదనతో పాటు ఇంటి పనుల్లో పూర్తిగా భాగస్వామ్యం కావాలి..

ఇలా ప్రతి అంశాన్ని తప్పనిసరి షరతుగా మార్చినప్పుడు మంచి సంబంధాలు కూడా చేతుల నుంచి జారిపోవచ్చు. జీవిత భాగస్వామిని ఎన్నుకోవడం అంటే ఒక "పర్ఫెక్ట్ వ్యక్తి" కోసం వెతకడం కాదు. మనతో కలిసి జీవితాన్ని నిర్మించగల వ్యక్తిని వెతకడం.

### తప్పు ఎవరిది?

ఈ విషయంలో ఒకరినొకరు నిందించడం సరైన పరిష్కారం కాదు. యువతకు తమ జీవితంపై నిర్ణయం తీసుకునే హక్కు ఉంది. తల్లిదండ్రులకు తమ పిల్లల భవిష్యత్తుపై ఆందోళన ఉండటం సహజం. కానీ ఈ రెండు అభిప్రాయాల మధ్య సంభాషణ లేకపోతే సమస్య మరింత పెరుగుతుంది. "మా మాట వినాలి" అని తల్లిదండ్రులు ఒత్తిడి చేయడం ఎంత తప్పో, "నా జీవితంలో ఎవ్వరూ జోక్యం చేసుకోకూడదు" అని పిల్లలు పూర్తిగా కుటుంబాన్ని దూరం పెట్టడం కూడా అంతే తప్పు. తల్లిదండ్రులు పిల్లలకు ఆదేశాలు ఇచ్చేవారిగా కాకుండా మంచి మిత్రులుగా ఉండాలి. పిల్లలు కూడా తల్లిదండ్రుల అనుభవాన్ని తక్కువగా చూడకూడదు.

### కులం, ప్రాంతం, భాష.. ఇవి జీవితానికి మించినవి కావు

ఇప్పటికీ కొన్ని కుటుంబాల్లో కులం, ప్రాంతం, భాష, కుటుంబ నేపథ్యం వంటి అంశాలకు అధిక ప్రాధాన్యత ఉంటుంది. కుటుంబ నేపథ్యం తెలుసుకోవడం తప్పు కాదు. కానీ అది ఒక మంచి మనిషిని తిరస్కరించడానికి కారణంగా మారకూడదు.

వివాహ జీవితాన్ని నిలబెట్టేది కేవలం ఒకే కులం కాదు.
నమ్మకం నిలబెడుతుంది.
గౌరవం నిలబెడుతుంది.
అవగాహన నిలబెడుతుంది.
సర్దుకుపోయే స్వభావం నిలబెడుతుంది.
బాధ్యత నిలబెడుతుంది.
ప్రేమ, పరస్పర గౌరవం నిలబెడతాయి.

అందుకే జీవిత భాగస్వామిని ఎన్నుకునేటప్పుడు బాహ్య గుర్తింపుల కంటే వ్యక్తిత్వానికి ప్రాధాన్యత ఇవ్వాలి.

### వివాహ వేదికలు పరిచయం చేయగలవు.. నిర్ణయం మనదే

ఇంటర్నెట్, మ్యాట్రిమోనీ వెబ్‌సైట్లు, యాప్‌లు, సోషల్ మీడియా వంటి వాటి ద్వారా ఇప్పుడు వేలాది సంబంధాలు పరిచయం అవుతున్నాయి. ఇది ఒక అవకాశం మాత్రమే; పరిష్కారం కాదు. ఒక ప్రొఫైల్‌లో మంచి ఉద్యోగం, మంచి కుటుంబం, మంచి ఫోటో కనిపించవచ్చు. కానీ ఆ వ్యక్తి నిజంగా ఎలా ఉంటాడో తెలుసుకోవడానికి సమయం అవసరం. వివాహానికి ముందు ఇద్దరూ ఒకరితో ఒకరు మాట్లాడుకోవాలి. తమ అభిప్రాయాలు, లక్ష్యాలు, ఉద్యోగం, ఆర్థిక వ్యవహారాలు, కుటుంబ బాధ్యతలు, పిల్లలపై ఆలోచనలు, భవిష్యత్తు జీవన విధానం వంటి ముఖ్యమైన విషయాలను స్పష్టంగా చర్చించుకోవాలి.

### తెలుసుకుని నిర్ణయం తీసుకోవాలి

అలాగే వ్యక్తిగత వివరాలు, ఉద్యోగం, కుటుంబ నేపథ్యం వంటి అంశాలను తగిన విధంగా ధృవీకరించుకోవడం కూడా అవసరం. వివాహానికి ముందు సంబంధాల విషయంలో బాధ్యత అవసరం. ఆధునిక సమాజంలో యువతీ యువకుల మధ్య స్నేహాలు, ప్రేమ సంబంధాలు పెరగడం సహజమైన సామాజిక మార్పు. అయితే ఏ సంబంధమైనా పరస్పర సమ్మతి, బాధ్యత, గౌరవం, భద్రత ఆధారంగా ఉండాలి. వివాహానికి ముందు శారీరక సంబంధాలు ఏర్పడటం లేదా ఏర్పడకపోవడం వ్యక్తిగత నిర్ణయం. అయితే ఏ నిర్ణయం తీసుకున్నా దాని భావోద్వేగ, ఆరోగ్య, సామాజిక పరిణామాలను అర్థం చేసుకుని బాధ్యతగా వ్యవహరించడం ముఖ్యం. ఒక వ్యక్తి వ్యక్తిగత నిర్ణయాన్ని మొత్తం యువతపై సాధారణీకరించడం సరైనది కాదు.

### 'పర్ఫెక్ట్ జీవిత భాగస్వామి' భ్రమ

నేటి యువతలో కొందరికి జీవిత భాగస్వామి విషయంలో అంచనాలు చాలా ఎక్కువగా ఉంటున్నాయి. అందం, ఉద్యోగం, జీతం, కుటుంబం, విద్య, నగరం, జీవనశైలి–ప్రతి విషయంలోనూ పరిపూర్ణత కోరుతున్నారు. కానీ మనం కోరుకునే ప్రతి లక్షణం ఒకే వ్యక్తిలో ఉండటం చాలా అరుదు. మనలో కూడా లోపాలు ఉంటాయి. అవతలి వ్యక్తిలో కూడా ఉంటాయి. వివాహం అనేది లోపాలు లేని వ్యక్తిని వెతకడం కాదు; ఒకరి లోపాలను మరొకరు అర్థం చేసుకుని కలిసి ఎదగడం.

### ఆలస్యం కావడం సమస్య కాదు

ఇక్కడ మరో విషయాన్ని గుర్తుంచుకోవాలి. ప్రతి ఆలస్యమైన వివాహాన్ని 'విపరీత ధోరణి'గా చూడటం సరైంది కాదు. చదువు, ఉద్యోగం, ఆర్థిక స్థిరత్వం, వ్యక్తిగత పరిస్థితులు లేదా సరైన భాగస్వామి కోసం ఎదురుచూడటం వంటి కారణాలతో వివాహం ఆలస్యం కావచ్చు. కొందరు వివాహం చేసుకోకూడదని నిర్ణయించుకోవచ్చు. వారి నిర్ణయాన్ని కూడా గౌరవించాలి. అయితే భయం, అవాస్తవ అంచనాలు, ఇతరులతో పోలికలు, సామాజిక ఒత్తిడి లేదా "ఇంకా మంచి సంబంధం వస్తుంది" అనే అంతులేని నిరీక్షణ వల్ల వివాహాన్ని నిరంతరం వాయిదా వేయడం మాత్రం ఆలోచించాల్సిన విషయం.

### తల్లిదండ్రులు చేయాల్సిన పని ఏమిటి?

తల్లిదండ్రులు తమ పిల్లలకు సంబంధాలు చూపించడం మాత్రమే కాకుండా, వారి మనస్తత్వాన్ని అర్థం చేసుకోవాలి. పిల్లలకు నచ్చని సంబంధాన్ని బలవంతంగా ఒప్పించడం కన్నా, ఎందుకు నచ్చలేదో తెలుసుకోవాలి. అదే సమయంలో పిల్లలు కూడా ప్రతి సంబంధంలో చిన్న లోపం కనిపించగానే తిరస్కరించకుండా, ముఖ్యమైన విషయాలు మరియు చిన్న విషయాల మధ్య తేడాను గుర్తించాలి.

### జీతం భవిష్యత్తులో పెరగవచ్చు.

ఇల్లు ఇప్పుడే లేదా? భవిష్యత్తులో నిర్మించుకోవచ్చు. ప్రాంతం వేరా? ఉద్యోగ పరిస్థితులను బట్టి మారవచ్చు. కానీ చెడు స్వభావం, అబద్ధాలు, హింసాత్మక ప్రవర్తన, వ్యసనాలు, బాధ్యతారాహిత్యం, గౌరవం లేకపోవడం వంటి అంశాలను మాత్రం చిన్నవిగా చూడకూడదు.

### గుర్తుంచుకోవాల్సిన విషయాలు

జీవిత భాగస్వామిని ఎన్నుకునేటప్పుడు ముందుగా వ్యక్తిత్వాన్ని చూడాలి.
తర్వాత బాధ్యతను చూడాలి.
ఆ తర్వాత ఆలోచనా విధానాన్ని చూడాలి.
కుటుంబంపై అవగాహనను చూడాలి.
అన్నింటికంటే ముఖ్యంగా మనతో కలిసి సమస్యలను ఎదుర్కొనే మనస్తత్వం ఉందా? అనేది చూడాలి.

ఎందుకంటే జీవితం ఎప్పుడూ ఆనందంగా ఉండదు. ఉద్యోగం పోవచ్చు. ఆర్థిక ఇబ్బందులు రావచ్చు. అనారోగ్యం రావచ్చు. కుటుంబ సమస్యలు రావచ్చు.

ఆ సమయంలో మన పక్కన నిలబడే వ్యక్తే నిజమైన జీవిత భాగస్వామి.

వివాహం ఒక ఒప్పందం కాదు.. ఒక సహప్రయాణం

వివాహాన్ని కేవలం సామాజిక కార్యక్రమంగా చూడకూడదు. ఖర్చులు, ఫంక్షన్, ఫోటోలు, బంధువులు, ఆర్భాటం——ఇవన్నీ ఒక రోజు లేదా కొన్ని రోజుల వ్యవహారాలు.

కానీ వివాహం తర్వాత ప్రారంభమయ్యేది జీవితాంతం కొనసాగే సహప్రయాణం.

అందుకే పెళ్లి వేడుక ఎంత ఘనంగా జరిగిందన్నదానికంటే, పెళ్లి తర్వాత ఇద్దరూ ఎంత సంతోషంగా జీవిస్తున్నారు అనేదే అసలు ప్రమాణం.

### ముగింపు

ఆలస్యమవుతున్న వివాహాల వెనుక సమాజంలో వచ్చిన మార్పులు ఉన్నాయి. వాటిలో చాలా మార్పులు సహజమైనవే. మహిళల విద్య, ఆర్థిక స్వాతంత్ర్యం, యువత స్వీయ నిర్ణయ హక్కు, కెరీర్‌పై దృష్టి——ఇవన్నీ సమాజ పురోగతికి సంకేతాలే.

అయితే పురోగతి పేరుతో పరస్పర గౌరవాన్ని కోల్పోవడం, అవాస్తవ అంచనాలు పెంచుకోవడం, ప్రతి విషయంలో పరిపూర్ణత కోరడం, కుటుంబాన్ని పూర్తిగా దూరం పెట్టడం వంటి ధోరణులు మాత్రం ఆలోచించాల్సినవే.

వివాహం త్వరగా జరగడం మాత్రమే విజయం కాదు.

వివాహం ఆలస్యంగా జరగడం మాత్రమే వైఫల్యం కాదు.

సరైన వ్యక్తిని, సరైన అవగాహనతో, పరస్పర గౌరవంతో జీవిత భాగస్వామిగా ఎంచుకుని సంతోషంగా జీవించడం——అదే అసలైన విజయం.

యువత తమ భవిష్యత్తును తామే నిర్ణయించుకోవాలి. తల్లిదండ్రులు వారి నిర్ణయాలకు అనుభవంతో తోడుగా నిలవాలి. ఇద్దరి మధ్య సంభాషణ పెరగాలి. అంచనాల కంటే అవగాహన పెరగాలి. "నా జీవితం" అనే భావనతో పాటు "మన జీవితం" అనే బాధ్యత కూడా రావాలి.

ఎందుకంటే మంచి వివాహం ఇద్దరు పరిపూర్ణ వ్యక్తుల కలయిక కాదు.. ఒకరినొకరు అర్థం చేసుకుంటూ, గౌరవిస్తూ, కష్ట సుఖాల్లో కలిసి ఎదగాలని నిర్ణయించుకున్న ఇద్దరు మనుషుల అందమైన ప్రయాణం.

# గుండె ఆరోగ్యానికి..

## ఇవి చాలా అవసరం

గుండె ఆరోగ్యం అంటే కేవలం కొలెస్ట్రాల్, రక్తపోటు నియంత్రణ లేదా రోజూ ఎన్ని అడుగులు నడుస్తున్నామనే విషయం మాత్రమే కాదు. మన ఆహారం, శారీరక శ్రమతో పాటు మానసిక ఆరోగ్యం, ఒత్తిడి, సామాజిక సంబంధాలు కూడా గుండెపై ప్రభావం చూపుతాయి. అమెరికన్ కార్డియాక్ సర్జన్ డాక్టర్ జెరెమీ లండన్ తన అనుభవం ఆధారంగా గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే దూరంగా ఉండాల్సిన ఐదు అలవాట్లను సూచించారు.



### ధూమపానం, వేపింగ్‌కు దూరం

గుండె ఆరోగ్యానికి సిగరెట్, పొగాకు అత్యంత ప్రమాదకరమైన అలవాట్లలో ఒకటి. సిగరెట్లలోని నికోటిన్ గుండె కొట్టుకునే వేగాన్ని, రక్తపోటును పెంచుతుంది. పొగతాగడం వల్ల రక్తనాళాలు దెబ్బతిని గుండె జబ్బుల ప్రమాదం పెరగవచ్చు. వేపింగ్ కూడా పూర్తిగా సురక్షితమైన ప్రత్యామ్నాయం కాదు. అందుకే సిగరెట్లు, పొగాకు, ఇ-సిగరెట్లకు దూరంగా ఉండటం మంచిది.

### అతిగా ప్రాసెస్ చేసిన ఆహారం

ప్యాకేజ్డ్, అత్యధికంగా ప్రాసెస్ చేసిన ఆహారాల్లో ఉప్పు, చక్కెర, అనారోగ్యకరమైన కొవ్వులు అధికంగా ఉండే అవకాశం ఉంది. వీటిని తరచుగా తీసుకోవడం దీర్ఘకాలంలో గుండె ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపవచ్చు. వీలైనంత వరకు కూరగాయలు, పండ్లు, పప్పుధాన్యాలు, తృణధాన్యాలు, నట్స్ వంటి సహజమైన లేదంటే తక్కువగా ప్రాసెస్ చేసిన వాటికి ప్రాధాన్యం ఇవ్వాలి.

### రోజంతా కూర్చోవడం మానేయాలి

శారీరక శ్రమ లేకపోవడం గుండె జబ్బులకు ముఖ్యమైన ప్రమాద కారకాల్లో ఒకటి. గుండె ఆరోగ్యంగా ఉండాలంటే శరీరాన్ని చురుకుగా ఉంచుకోవాలి. ఇందుకు తప్పనిసరిగా జిమ్‌కు వెళ్లాల్సిన అవసరం లేదు. రోజూ నడవడం, సైకిల్ తొక్కడం, మెట్లు ఎక్కడం వంటి సాధారణ కార్యకలాపాలు కూడా శారీరక చురుకుదనాన్ని పెంచుతాయి.

### ఒంటరితనాన్ని నిర్లక్ష్యం చేయకండి

ఒంటరితనం అంటే ఇంట్లో ఒంటరిగా ఉండటం మాత్రమే కాదు. అర్థవంతమైన సామాజిక సంబంధాలు లేకపోవడం కూడా ఒంటరితనంగా భావించవచ్చు. దీర్ఘకాలిక ఒంటరితనం, సామాజిక ఒంటరితనం వల్ల ఒత్తిడి, నిద్ర సమస్యలు, శారీరక శ్రమ తగ్గడం వంటి సమస్యలు ఏర్పడవచ్చు. ఇవి పరోక్షంగా గుండె ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే అవకాశం ఉంది. కుటుంబ సభ్యులతో మాట్లాడటం, స్నేహితులను కలవడం, సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనడం వంటి చిన్న అలవాట్లు మానసిక ఆరోగ్యానికి మేలు చేయవచ్చు.

### దీర్ఘకాలిక ఒత్తిడిని నియంత్రించాలి

రోజువారీ జీవితంలో కొంత ఒత్తిడి సహజమే. కానీ దీర్ఘకాలిక ఒత్తిడి ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపవచ్చు. కొందరిలో ఒత్తిడి కారణంగా అతిగా తినడం, పొగతాగడం, వ్యాయామాన్ని నిర్లక్ష్యం చేయడం వంటి అలవాట్లు పెరగవచ్చు. తగినంత నిద్ర, క్రమం తప్పకుండా శారీరక శ్రమ, విశ్రాంతి, కుటుంబ సభ్యులు మరియు స్నేహితులతో సమయం గడపడం ఒత్తిడిని నియంత్రించడంలో సహాయపడవచ్చు.

### ఒంటరితనం వల్లే వస్తాయా?

ఒంటరితనం ఒక్కటే గుండె జబ్బులకు కారణమవుతుందని ఖచ్చితంగా చెప్పలేం. వయస్సు, జన్యుపరమైన అంశాలు, రక్తపోటు, మధుమేహం, కొలెస్ట్రాల్, ధూమపానం, ఆహారం, శారీరక శ్రమ వంటి అనేక అంశాలు గుండె ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తాయి. గుండె సంరక్షణలో ఆహారం, వ్యాయామంతో పాటు మానసిక ఆరోగ్యం, ఒత్తిడి నియంత్రణ, కుటుంబం–స్నేహితులతో ఆరోగ్యకరమైన సంబంధాలు కూడా ముఖ్యమైన భాగాలేనని గుర్తుంచుకోవాలి.

గుండెను ఆరోగ్యంగా ఉంచుకోవాలంటే పొగాకుకు దూరంగా ఉండటం, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, రోజూ చురుకుగా ఉండటం, సామాజిక సంబంధాలను కొనసాగించడం, ఒత్తిడిని నియంత్రించడం వంటి అలవాట్లను జీవితంలో భాగం చేసుకోవడం మంచిది.

# ఈ లక్షణాలున్నాయా?

## రాత్రి విధులు నిర్వహించే వారు అప్రమత్తంగా ఉండాలి



నేటి కాలంలో ఎక్కువ మంది కంప్యూటర్ల ముందు కూర్చునే వర్క్ చేస్తున్నారు. ఇందులోనూ చాలావరకు నైట్ షిఫ్టులే ఉంటున్నాయి. అయితే ఇలా రాత్రి విధులు నిర్వహించే వారిలో కొత్త ఆరోగ్య సమస్యలు ఉంటున్నట్లు కొందరు ఆరోగ్య నిపుణులు తెలుపుతున్నారు. ముఖ్యంగా వీరిలో బ్యాక్ పెయిన్, బోన్ పెయిన్, మజిల్స్ పెయిన్ తోపాటు అలసటగా ఉండడం.. ఏ పనిపై శ్రద్ధ లేకపోవడం వంటివి ఉంటున్నాయి. ఎందుకు కారణం డి విటమిన్ లోపం అని తెలుపుతున్నారు. అయితే ఈ లోపం ఎందుకు ఏర్పడుతుంది? డే విటమిన్ లోప నివారణకు ఏం చేయాలి?

రాత్రిళ్ళు ఎక్కువసేపు వర్క్ చేసేవారు ఉదయం ఆలస్యంగా నిద్ర లేస్తారు. మీరు నిద్ర లేచేసరికి సూర్యుడి నుంచి వచ్చే ఉష్ణోగ్రత ఎక్కువగా మారుతుంది. ఇలాంటి సమయంలో బయటకు వెళ్లడానికి ఇష్టపడరు. ఆ తర్వాత మిగతా పనులతోనే కాలం గడిచి మళ్లీ సాయంత్రం సమయం గడుస్తుంది. ఈ విధంగా వీరు ఎక్కువసేపు ఇంట్లోనే లేదా కార్యాలయాల్లోనే గడుపుతూ సూర్యరష్మికి దూరంగా ఉంటున్నారు. ఈ కారణాలవల్ల వీరు డీ–విటమిన్‌కు దూరం అవుతున్నారు. ఆరోగ్య నిపుణులు తెలుపుతున్న ప్రకారం సూర్య రశ్మి నుంచి ఎక్కువగా డీ–విటమిన్ లభించే అవకాశం ఉంటుంది. నిత్యం ఎండలో పనిచేసే వారిలో ఈ లోపం కనిపించదు అని అంటున్నారు.

అయితే నైట్ షిఫ్ట్ చేసేవారు ఇలా ఎండకు దూరం కావడమే కాకుండా రకరకాల ఆహార పదార్థాలను సేవించడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. వీటిలో ఎక్కువగా బాడీపెయిన్స్ ఉన్నట్లు కొందరు తెలుపుతున్నారు. అయితే ఇలాంటి బోన్ పెయిన్స్, మజిల్ పెయిన్స్ ఉన్నవారు ఆందోళన చెందుతూ అనవసరమైన మెడిసిన్స్ వాడుతూ ఉంటారని తెలుపుతున్నారు. ఇందులో భాగంగా ముందు జాగ్రత్తగా డీ–విటమిన్ లభించే ఆహారాన్ని తీసుకోవాలని చెబుతున్నారు.

ఈ విటమిన్ ఎక్కువగా లభించే వాటిల్లో చేపలు, గుడ్లు, విటమిన్ డి పోర్టిఫైడ్ పాలు వంటివి తీసుకోవాలని అంటున్నారు. అయితే ఇది పరిమాణాన్ని బట్టి మాత్రమే తీసుకోవాలి. అలాగే ప్రతిరోజు ఉదయం సూర్య రష్మి తగిలేలా ఎండలో ఉండే ప్రయత్నం చేయాలి. ఇదే సమయంలో స్వచ్ఛమైన నూనెను ఉపయోగించిన ఆహారం తీసుకోవాలి.

అయినప్పటికీ ఈ సమస్య పరిష్కారం కాకపోతే వైద్యులను సంప్రదించాలి. అయితే కొందరు డీ–విటమిన్ ప్రత్యేకంగా లభించే టాబ్లెట్స్ వాడుతూ ఉంటారు. ఇలాంటి ప్రయత్నం ఎట్టి పరిస్థితుల్లో చేయవద్దని ఆరోగ్య నిపుణులు తెలుపుతున్నారు. ముఖ్యంగా రాత్రి సమయంలో విధులు నిర్వహించేవారు ఇలాంటి లక్షణాలు కనిపిస్తే ముందు జాగ్రత్తగా కొన్ని రకాల పరీక్షలు చేయించుకోవాల్సిన అవసరం ఉందని అంటున్నారు.

# హైదరాబాద్ - నేపాల్ కు యాత్రికులు

**ముద్ర, నేషనల్ డెస్క్:**
నేపాల్‌లో మెరుపు వరదలు సంభవించి సుమారు 500 మంది గల్లంతయ్యారు. 95 మంది మృతిచెందారు. ఇక హైదరాబాద్ నుంచి 153 మంది యాత్రికులు ఓ ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా నేపాల్ వెళ్లారు. వీరిలో అనారోగ్యం కారణంగా 16 మంది గదిలోనే బస చేయడంతో సురక్షితంగా బయటపడ్డారు. కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన భాస్కర్‌శాస్త్రి కుటుంబం కైలాస మానసరోవర్ యాత్రకు వెళ్లి చిక్కుకుంది. ఈ మేరకు భాస్కర్ శాస్త్రి అక్కడి నుంచి న్యూస్‌టుడేకు ఫోన్‌లో వివరాలు వెల్లడించారు. 'మానసరోవర్ యాత్ర కోసం ఈనెల 10న భార్య శారద, కుమారుడు రఘునాథ్, కోడలు హన్సికతో కలిసి వెళ్లాం. బెంగళూరు నుంచి సుభాష్ వైద్య స్వామిజీ ద్వారా నేపాల్‌కు చేరాం. మా బృందంలో 153 మంది ఉన్నారు. నేపాల్ నుంచి మూన్ హిమాలయ అనే ట్రావెల్స్ ద్వారా కైలాస యాత్ర చేపట్టాం. ఈనెల 25న మానసరోవర్ యాత్ర ముగించుకున్నాం. అంతా పరిక్రమ యాత్రకు వెళ్లేందుకు సిద్ధమయ్యాం. అయితే మాతో పాటు మొత్తం 16 మంది అస్వస్థతకు లోనవడంతో ఆగిపోయాం. మిగిలిన వారంతా పరిక్రమ యాత్రకు వెళ్లారు. వారి యాత్ర 28న మధ్యాహ్నంతో ముగియాల్సి ఉంది.

## మట్టి వాటర్ బాటిల్‌తో సహజ చల్లదనం

మట్టి బాటిళ్లు నీటిని సహజంగా చల్లగా ఉంచుతాయి. ఇంట్లో రోజువారీ నీటి వినియోగానికి ఇవి మంచి ప్రత్యామ్నాయం. అయితే పగిలే అవకాశం ఉండటంతో జాగ్రత్తగా ఉపయోగించాలి. పరిశుభ్రత విషయంలోనూ ప్రత్యేక శ్రద్ధ అవసరం.



# 22-ఏ రద్దు కోసం జెన్ జీ తరహా ఉద్యమం

**ప్రభుత్వం మెడలు వంచి ప్రజల ఆస్తులను కాపాడుతాం**

**ఇది పూర్తిగా రాజ్యాంగ విరుద్ధం**

**తప్పు చేశారు రద్దు చేసి పాపాన్ని కడుక్కోండి**

**మాజీ మంత్రి హరీశ్ రావు**



**ముద్ర కూకట్ పల్లి :** 22-ఏ నిషేధిత జాబితాను సెప్టెంబర్ 7లోగా రద్దు చేయకుంటే ఢిల్లీ తరహాలో ప్రత్యక్ష ఉద్యమం చేపట్టి, అసెంబ్లీని స్తంభింపజేసి సెక్రటేరియట్‌ను ముట్టడిస్తామని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత తన్నీరు హరీశ్‌రావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. 22-ఏ రద్దు డిమాండ్‌తో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం కూకట్‌పల్లి ఎన్ఆర్ఎస్ఏ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. 22-ఏ ద్వారా ప్రజల ఆస్తులను రాత్రికి రాత్రే నిషేధిత జాబితాలో చేర్చి ప్రభుత్వం ప్రజలకు అన్యాయం చేస్తోందని ఆరోపించారు. 22-ఏ జాబితా నుంచి 98 శాతం భూములను తొలగించామని చెబుతున్న ప్రభుత్వం మిగిలిన సమస్యను పూర్తిగా పరిష్కరించేందుకు చట్టాన్ని ఎందుకు రద్దు చేయడం లేదని ప్రశ్నించారు.ప్రజల ఆస్తుల విషయంలో కొందరు మధ్యవర్తులు 30 శాతం వాటా ఇస్తే సమస్య పరిష్కరిస్తామని చెప్పి దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. ప్రజలు ఎవరికి ఒక్క రూపాయి కూడా ఇవ్వవద్దని, మధ్యవర్తుల మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు.హైదరాబాద్‌లో ఒకవైపు హైడ్రా, మరోవైపు 22-ఏ కారణంగా ప్రజలు ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 22-ఏను రద్దు చేయకపోతే బీఆర్ఎస్ ప్రజల పక్షాన పోరాటాన్ని ఉధృతం చేస్తుందని స్పష్టం చేశారు.కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ.. తమ ప్రభుత్వ హయాంలో హౌసింగ్ బోర్డు స్థలాలను ప్రజలకు ఉపయోగపడేలా కేటాయించామని, ప్రస్తుతం వాటిని విక్రయించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. నియోజకవర్గ ప్రజలకు అన్యాయం చేస్తే సహించబోమన్నారు.మాజీ ఎమ్మెల్యే, లోక్‌సత్తా అధినేత జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ.. ప్రభుత్వం నిబంధనల ప్రకారం పనిచేయాలని, 22-ఏ విషయంలో నిబంధనలను పాటించాలని సూచించారు.సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్లు మందడి శ్రీనివాసరావు, ముద్దం నరసింహాయాదవ్, ఆవుల రవీందర్‌రెడ్డి, పండాల సతీష్‌గౌడ్, పగడాల బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ నీటి తరలింపుపై ఆగ్రహం

**ముద్ర, హైదరాబాద్:** నాగార్జునసాగర్ కుడి కాలువ నుంచి కేఆర్ఎంబీ అనుమతులు లేకుండా ఏపీ వైపు నీటిని తరలించడంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి ఏపీ వైపు నిండుగా పారుతున్న కుడి కాలువ నీళ్లే సాక్ష్యమని విమర్శించారు.ఏపీ 47 టీఎంసీల నీటిని కోరినప్పటికీ, దీనిపై నిర్ణయం తీసుకోవాల్సిన త్రిసభ్య కమిటీ సమావేశం వాయిదా పడిందని తెలిపారు. అయినా ఎలాంటి అనుమతులు లేకుండా నీటిని తరలించడం ఏమిటని ప్రశ్నించారు. కేఆర్ఎంబీ, త్రిసభ్య కమిటీని ఏపీ అధికారులు లెక్కచేయకుండా వ్యవహరిస్తున్నా తెలంగాణ ప్రభుత్వం ఎందుకు అడ్డుకోవడం లేదని నిలదీశారు.శ్రీశైలం నుంచి వెలిగొండ టన్నెల్ ద్వారా నీటిని తరలించడంతో పాటు నాగార్జునసాగర్ కుడి కాలువ నుంచి కూడా నీటిని తరలిస్తున్నారని ఆరోపించారు. ఎల్‌నినో ప్రభావంతో కరువు పరిస్థితులు నెలకొన్న సమయంలో తెలంగాణ నీటి హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.గత రెండేళ్లుగా కృష్ణా జలాల్లో తెలంగాణకు దక్కాల్సిన తాత్కాలిక వాటాను సైతం వినియోగించుకోలేకపోయామని ఆరోపించిన హరీశ్‌రావు.. ఈ ఏడాది కూడా అదే పరిస్థితి పునరావృతం కాకుండా ప్రతి చుక్క నీటినీ కాపాడాలని డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి కేఆర్ఎంబీపై ఒత్తిడి తీసుకువచ్చి తెలంగాణ నీటి హక్కులను పరిరక్షించాలని కోరారు.

# నూతన అధ్యక్షుడి ఎంపికకు అభిప్రాయాలను సేకరిస్తున్నాం




**ముద్ర, చేవెళ్ల:** రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) నూతన అధ్యక్షుడి ఎంపిక ప్రక్రియలో భాగంగా ఏఐసీసీ సూచనల మేరకు సంఘటన్ సృజన్ అభియాన్ (SSA) ద్వారా క్షేత్రస్థాయి నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను తెలుసుకుంటున్నామని కర్ణాటక ఎమ్మెల్సీ, ఏఐసీసీ కార్యదర్శి మరియు రంగారెడ్డి జిల్లా అబ్జర్వర్ పి.వి. మోహన్ తెలిపారు.రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి గారి ఆధ్వర్యంలో, చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పామేన భీమ్ భరత్ పాల్గొని, మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని బాగిచా ఫామ్‌హౌస్‌లో చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి సంస్థాగత సంప్రదింపుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా పి.వి. మోహన్ మాట్లాడుతూ, ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ నాయకత్వం, ఆలోచనలు మరియు మార్గదర్శకత్వంలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడమే సంఘటన్ సృజన్ అభియాన్ ప్రధాన లక్ష్యమన్నారు."పార్టీ కామ్‌దార్ – నైతికత – లక్ష్యం – వ్యూహం" అనే స్ఫూర్తితో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత పటిష్టం చేస్తూ, ప్రజలకు చేరువైన సమర్థవంతమైన నాయకత్వాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యమని తెలిపారు.పార్టీ కోసం నిరంతరం పనిచేసే కామ్‌దార్, ప్రజాసేవలో నైతికత, కాంగ్రెస్ సిద్ధాంతాలపై స్పష్టమైన లక్ష్యం, ఎన్నికలు మరియు సంస్థాగత నిర్మాణంపై సమర్థవంతమైన వ్యూహం కలిగిన నాయకత్వం ద్వారానే పార్టీ మరింత బలోపేతం అవుతుందని పి.వి. మోహన్ పేర్కొన్నారు.రాజ్యాంగ పరిరక్షణ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ, అందరినీ కలుపుకుని ముందుకు సాగడమే కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలని తెలిపారు. సంఘటన్ సృజన్ అభియాన్ ద్వారా బూత్ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీని మరింత పటిష్టం చేసి, ప్రజలతో నిరంతరం అనుసంధానమైన బలమైన సంస్థాగత నిర్మాణాన్ని ఏర్పాటు చేయడమే లక్ష్యమన్నారు.డీసీసీ నూతన అధ్యక్షుడి ఎంపికలో క్షేత్రస్థాయి నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలకు పూర్తి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. పార్టీని సమర్థవంతంగా ముందుకు నడిపించే, అందరినీ కలుపుకుని పనిచేసే, పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉండే నాయకత్వాన్ని పారదర్శకమైన విధానంలో ఎంపిక చేస్తామని అన్నారు.ఈ సమావేశంలో టీపీసీసీ అబ్జర్వర్లు, సత్తుపల్లి శాసనసభ్యులు శ్రీమతి డా. మట్టా రాగమయి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఇ.వి. శ్రీనివాస్ రావు పాల్గొన్నారు.డీసీసీ అధ్యక్ష పదవి కోసం పోటీలో ఉన్న అభ్యర్థులు సమావేశానికి హాజరై తమ అభిప్రాయాలు, పార్టీ అభివృద్ధికి సంబంధించిన సూచనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వీరితో పాటు టీపీసీసీ కార్యదర్శి రాంరెడ్డి ,రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యులు సత్య నారాయణ రెడ్డి,రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరి సతీష్ ,జనార్దన్ రెడ్డి,రాష్ట్ర మైనారిటీ నాయకులు అశ్వక్ ,రాష్ట్ర నాయకులు ఉదయ్ మోహన్ రెడ్డి ,మొయినాబాద్ మున్సిపల్ చైర్మన్ షాబాద్ సోనియా దర్శన్ ,శంకర్‌పల్లి మున్సిపల్ చైర్మన్ ప్రవీణ్ ,చేవెళ్ల మున్సిపల్ చైర్మన్ దేవర సమత వెంకట్ రెడ్డి , మొయినాబాద్ మాజీ మండల అధ్యక్షులు మానయ్య మొయినాబాద్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు సత్యనారాయణ,మొయినాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు విక్రమ్ రెడ్డి ,శంకర్‌పల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షులు వెంకట్ రెడ్డి ,శంకర్‌పల్లి మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు చంద్ర మౌళి , జిల్లా లైబ్రరీ చైర్మన్ మధుసూదన్ రెడ్డి,చేవెళ్ల మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్య గౌడ్ ,శంకర్ పల్లి మండల సేవాదళ్ అధ్యక్షులు ఎండి నసీరుద్దీన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సేంద్రీయ వ్యవసాయం ద్వారా నేల సారాన్ని కాపాడుకోవచ్చు




**వెల్స్పన్ ఫౌండేషన్ అసిస్టెంట్ మేనేజర్ పవన్ కుమార్**

**ముద్ర, చేవెళ్ల:** సేంద్రీయ వ్యవసాయం ద్వారా భూమి యొక్క సారాన్ని కాపాడుకోవచ్చునని వెల్స్పన్ ఫౌండేషన్ అసిస్టెంట్ మేనేజర్ పవన్ కుమార్ తెలిపారు. బుధవారం రోజు జన వికాస్ రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో మండలంలోని ముద్దెం గూడా గ్రామంలో రైతులకు సేంద్రీయ వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువులు పురుగు మందుల వినియోగాన్ని తగ్గించడం వల్ల ఆరోగ్యకరమైన పంటలు వస్తాయన్నారు. ఎకరమైన పంటల ఉత్పత్తి ఉంటుందన్నారు. రైతులకు దీర్ఘకాలికంగా కలిగే ప్రయోజనాలపై ఆయన అవగాహన కల్పించారు. సేంద్రీయ వ్యవసాయ పద్ధతులను రైతులు తప్పనిసరిగా ఆచరించాలన్నారు. ఈ పద్ధతుల ద్వారా రైతులకు ఖర్చు తగ్గి ఆదాయం బాగా పెరుగుతుందన్నారు. ఇలాంటి సందేహాలు ఉన్న తమ సిబ్బంది వాటికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో తెలియజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ నర్సింలు మాజీ సర్పంచ్ జయమ్మ సుదర్శన్ ఫౌండేషన్ సిబ్బంది భద్రయ్య సంపత్ కుమార్ రాజు ఉపసర్పంచ్ శివకుమార్ నర్సింలు శ్రీశైలం రమేష్ పాల్గొన్నారు.

## చార్మినార్ వద్ద ఘనంగా మిలాద్-ఉన్-నబీ వేడుకలు



చారిత్రక చార్మినార్ వద్ద మిలాద్-ఉన్-నబీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. చార్మినార్, మక్కా మస్జిద్ ప్రాంతాల నుండి భారీ మతపరమైన శాంతి యాత్ర ప్రారంభమైంది.ఈ ఊరేగింపు గుల్జార్ హౌజ్, పతేర్‌గట్టి, నయాపుల్, దారుల్‌షిఫా మీదుగా సాగి మొఘల్‌పురా వరకు కొనసాగింది. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. డ్రోన్లు, సీసీ కెమెరాలతో మార్గాలను నిరంతరం పర్యవేక్షించారు. నగరంలో పలుచోట్ల ముస్లింలు ప్రార్థనలు నిర్వహించడంతో పాటు రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు. - ముద్ర, హైదరాబాద్

## సూర్యాపేట రోడ్డు ప్రమాద క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి

**రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ**

**ముద్ర, హైదరాబాద్:** సూర్యాపేట జిల్లా కోదాడ మండలం దుర్గాపురం స్టేజ్ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాద ఘటనపై రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో ఆరుగురు ప్రయాణికులు మృతి చెందడం అత్యంత బాధాకరమన్నారు. మృతుల్లో ఐదుగురు మహిళలు, ఒక పురుషుడు ఉన్నారని తెలిపారు.మృతుల కుటుంబాలకు మంత్రి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రమాదంలో గాయపడి కోదాడ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ముగ్గురు క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు.మరో 11 మంది క్షతగాత్రులను వారి విజ్ఞప్తి మేరకు అంబులెన్సుల ద్వారా విజయవాడ, ఏలూరు ఆసుపత్రులకు తరలించినట్లు వైద్య శాఖ అధికారులు మంత్రికి వివరించారు.మృతుల వివరాలను త్వరగా గుర్తించాలని మంత్రి ఆదేశించారు. మృతదేహాలకు త్వరితగతిన పోస్టుమార్టం నిర్వహించేందుకు రెండు బృందాలను ఏర్పాటు చేసి, ప్రక్రియ పూర్తయిన వెంటనే కుటుంబ సభ్యులకు మృతదేహాలను అప్పగించాలని అధికారులకు సూచించారు.

## మూసాపేట్ ఆంజనేయ నగర్ నూతన పాలకవర్గానికి అభినందనలు



**ముద్ర, కూకట్‌పల్లి:** మూసాపేట్ ఆంజనేయ నగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన జె. మహేందర్ ప్యానల్ సభ్యులు బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావును ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విజేతలను పుష్పగుచ్ఛాలతో, శాలువాలతో వడ్డేపల్లి రాజేశ్వరరావు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం ఆయన మాట్లాడుతూ... కాలనీ అభివృద్ధి, మౌలిక వసతుల మెరుగుదల మరియు నివాసితుల సంక్షేమమే ధ్యేయంగా నూతన పాలకవర్గం సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. ఆంజనేయ నగర్ ప్రగతికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని హామీ ఇచ్చారు.కాలనీలో భద్రతను మరింత పటిష్టం చేయాల్సిన అవసరం ఉందని, ప్రస్తుతం ఉన్న సీసీ కెమెరాలు సరిగ్గా పనిచేయడం లేదని పాలకవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై తక్షణమే స్పందించిన ఆయన, కాలనీవాసుల రక్షణను దృష్టిలో ఉంచుకుని ప్రధాన కూడళ్లలో నూతన సీసీ కెమెరాల ఏర్పాటుకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని అక్కడికక్కడే అందజేశారు.ప్రజలు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ కాలనీని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లాలని ఆయన నూతన కమిటీకి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉప్పల శేఖర్ గుప్తా, జె. మహేందర్ ప్యానల్ సభ్యులు, కాలనీ ప్రతినిధులు, నివాసితులు పాల్గొన్నారు.

## పార్టీకి కష్టపడిన వారికి న్యాయం చేయండి

**జిల్లా గ్రంధాలయ సంస్థల చైర్మన్ మధుసూదన్ రెడ్డి**



**ముద్ర, చేవెళ్ల:** పార్టీకి కష్టపడి పనిచేసిన వారికి న్యాయం చేయాలని జిల్లా గ్రంధాలయ సంస్థల చైర్మన్ మధుసూదన్ రెడ్డి అన్నారు. బుధవారం రోజు పార్టీ కార్యకర్తలు నాయకులు సర్పంచులతో కలిసి స్థానిక ఎమ్మెల్యే యాదయ్యకు ఒక ఫిర్యాదును అందజేశారు. షాబాద్ సహకార సంఘము చైర్మన్ గా డైరెక్టర్ గా ఎంపిక చేసే వారిని వాటి కష్టపడే వారిని మాత్రమే ఎంపిక చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఏనాడు పార్టీ కొరకు కష్టపడని వారికి ప్రాధాన్యత ఇవ్వడము సమంజసం కాదన్నారు. పార్టీ కార్యకర్తలు అందరూ నాయకులు ఒప్పుకున్న వారిని మాత్రమే డైరెక్టర్ గా చైర్మన్ గా ఎంపిక చేయాలన్నారు. ప్రస్తుతం చేసిన పాలకవర్గాన్ని వెంటనే రద్దుచేసి కొత్తవారిని ఎంపిక చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులకు కార్యకర్తలకు న్యాయం చేయాలని కోరారు. ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసిన వారిలో ఆయనతోపాటు గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్ సర్పంచులు నవనీత స్వామి ప్రభాకర్ రెడ్డి లావణ్య చెన్నయ్య సబితా గోవర్ధన్ రెడ్డి స్వరూప మహేందర్ గౌడ్ అశోక్ సందీప్ సవిత సుభాష్ చంద్ర శాంతమ్మ యాదయ్య రవీందర్ నాయక్ వెంకట్ రెడ్డి రాహుల్ పార్టీ కార్యకర్తలు నాయకులున్నారు.

## భక్తిశ్రద్ధలతో మిలాద్-ఉన్-నబీ వేడుకలు



**ముద్ర, చేవెళ్ల:** మహమ్మద్ ప్రవక్త జన్మదిన సందర్భంగా మండలంలో మిలాద్ ఉన్ నబి పండగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మంగళవారం రాత్రి జాగారం చేసిన ముస్లింలందరూ బుధవారం ఉదయం భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈదుగా నుండి షాబాద్ పైల్వాన్ షా వలి దర్గా వరకు ర్యాలీ నిర్వహించారు. చిన్న పెద్ద తేడా లేకుండా అందరూ ర్యాలీలో పాల్గొని ప్రవక్తను స్మరణం చేసుకున్నారు. అనంతరం దర్గాలో సహపంక్తి భోజనాలు చేశారు. ఈ ఉత్సవాల్లో ముస్లిం మత పెద్దలు, గురువులు పాల్గొన్నారు.

## వాటర్ బాటిల్ కంటే పరిశుభ్రత కూడా ముఖ్యం

ఏ బాటిల్ ఉపయోగించినా దాన్ని క్రమం తప్పకుండా శుభ్రం చేయడం చాలా ముఖ్యం. మూత, నోరు, లోపలి భాగంలో మురికి పేరుకుపోకుండా చూసుకోవాలి. బాటిల్ ను ఎంచుకునేటప్పుడు ఆరోగ్యంతో పాటు వినియోగ సౌలభ్యం, మన్నిక, పర్యావరణ ప్రభావాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలి.



## జైపూర్ పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన మంచిర్యాల డీసీపీ

ముద్ర, జైపూర్:

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల జోన్ జైపూర్ పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీల్లో భాగంగా మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ వెంకటేశ్వర్లు, సీఐ నవీన్, ఎస్ఐ భూమేష్ పుష్పగుచ్ఛాలు అందించి డీసీపీకి స్వాగతం పలికారు. అనంతరం డీసీపీ పోలీసు గౌరవ వందనం స్వీకరించారు.

ముందుగా పోలీస్ స్టేషన్ పరిసరాలను, వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలను డీసీపీ పరిశీలించారు. పోలీస్ స్టేషన్ ఆవరణను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. అనంతరం రిసెప్షన్ సెంటర్‌లో సిబ్బందితో మాట్లాడి సంబంధిత రికార్డులను తనిఖీ చేశారు. స్టేషన్ రైటర్, సీసీటీఎన్ఎస్ రైటర్లతో మాట్లాడి ఆన్‌లైన్‌లో కేసుల వివరాల నమోదు, అప్‌లోడ్ ప్రక్రియపై వివరాలు తెలుసుకున్నారు. పెండింగ్ కేసుల ఫైళ్లు, క్రైమ్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. నమోదైన కేసులు, దర్యాప్తు పురోగతి, పెండింగ్ వ్యవహారాలపై సీఐ నవీన్, ఎస్ఐ భూమేష్‌లను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా డీసీపీ ఎగ్గడి భాస్కర్ మాట్లాడుతూ.. పోలీసు సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, శాంతిభద్రతల పరిరక్షణలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలను తరచూ సందర్శించి ప్రజలతో సత్సంబంధాలు పెంపొందించుకోవడంతో పాటు సమాచార వ్యవస్థను మరింత పటిష్ఠం చేసుకోవాలని సూచించారు.

మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రత్యేకంగా కృషి చేయాలని తెలిపారు. రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా, కారులో ప్రయాణించే వారు సీటుబెల్ట్ వినియోగించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రజల భద్రత దృష్ట్యా గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వాలని, వాటి అవసరం, ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు రాత్రివేళల్లో పెట్రోలింగ్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారి సమస్యలను సానుకూలంగా పరిష్కరించేందుకు కృషి చేస్తూ మెరుగైన పోలీసు సేవలు అందించాలని డీసీపీ సూచించారు. అనంతరం డీసీపీ ఎగ్గడి భాస్కర్ పోలీసు అధికారులతో కలిసి జైపూర్ పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ తనిఖీల్లో ఏసీపీ వెంకటేశ్వర్లు, సీఐ నవీన్, ఎస్ఐ భూమేష్ తదితరులు పాల్గొన్నారు.

## యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



- ఎస్ఐ జగదీశ్వర్

ముద్ర ,చిగురుమామిడి:

యువత మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో ఉన్నత భవిష్యత్తును నిర్మించుకోవాలని చిగురుమామిడి ఎస్ఐ జగదీశ్వర్ సూచించారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం నవాబుపేటలో గత రెండు, మూడు రోజులుగా గ్రామానికి చెందిన ఎర్రోజ్ దేవేందర్ మద్యం మత్తులో గ్రామపంచాయతీ కార్యాలయం, ప్రభుత్వ పాఠశాల పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పదంగా ఇంజక్షన్ సూదులు, పలు రకాల టాబ్లెట్లతో సంచరిస్తున్నట్లు గ్రామస్తులు గుర్తించారు. ఈ విషయాన్ని బుధవారం చిగురుమామిడి ఎస్ఐ జగదీశ్వర్‌కు సమాచారం అందించారు. దీంతో ఎస్ఐ పోలీసు సిబ్బందితో కలిసి నవాబుపేటకు చేరుకుని దేవేందర్ సంచరించిన ప్రాంతాలను పరిశీలించారు. అక్కడ ఇంజక్షన్లు, పలు రకాల టాబ్లెట్లకు సంబంధించిన కవర్లను గుర్తించారు. అనంతరం దేవేందర్‌కు డ్రగ్ పరీక్ష నిర్వహించగా నెగిటివ్‌గా వచ్చినట్లు పోలీసులు తెలిపారు. అక్కడ లభించిన ఇంజక్షన్లు, టాబ్లెట్ల గురించి దేవేందర్‌ను పోలీసులు విచారించగా, మద్యం మత్తు తగ్గకుండా ఉం డేందుకు వాటిని వినియోగిస్తున్నట్లు వెల్లడైనట్లు తెలిపారు.

ఈ సందర్భంగా ఎస్ఐ జగదీశ్వర్ మాట్లాడుతూ.. యువత చెడు అలవాట్లకు లోనై చదువును పక్కనపెట్టి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. క్రమశిక్షణతో జీవిస్తే మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా మంచి భవిష్యత్తును నిర్మించుకోవచ్చన్నారు. గంజాయి, కొకైన్, పొగాకు తదితర మత్తు పదార్థాలు ఆరోగ్యాన్ని తీవ్రంగా దెబ్బతీయడంతో పాటు జీవితాన్ని నాశనం చేస్తాయని హెచ్చరించారు. మండలంలో ఎక్కడైనా మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల సరఫరా జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ఐ జగదీశ్వర్ కోరారు.

## బెజ్జూర్ లో పిచ్చి కుక్కల దాడి

ముద్ర, అసిఫాబాద్:

బెజ్జూర్ లో పిచ్చి కుక్కల దాడి ముగ్గురికి గాయాలయ్యాయి. బెజ్జూర్ మండల కేంద్రానికి చెందిన మానేపల్లి మణితేజ అనే బాలుడు, టేకం అమ్మ అక్క, లస్మక్కలపై బుధవారం పిచ్చికుక్కల దాడి చేశాయి. టేకం మణితేజ అనే విద్యార్థి ఆటలాడుకుంటుండగా పిచ్చి కుక్కలు దాడి చేయగా, ఆ తర్వాత ఇద్దరిపై దాడి చేశాయి. దీంతో తీవ్ర గాయాలైన క్షతగాత్రులను బెజ్జూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

# శ్రీలంక-తెలంగాణ సాంస్కృతిక సంబంధాల బలోపేతానికి ప్రోత్సాహం

- శ్రీలంక కళాకారులకు మంత్రి జూపల్లి సత్కారం..

ముద్ర, హైదరాబాద్:

శ్రీలంక–తెలంగాణ మధ్య బౌద్ధ, సాంస్కృతిక, పర్యాటక సంబంధాలను మరింత బలోపేతం చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, నాగపూర్‌లోని దక్షిణ మధ్య సాంస్కృతిక కేంద్రం, సింగిడి సాంస్కృతిక సంస్థల సౌజన్యంతో ఇటీవల రవీంద్రభారతిలో నిర్వహించిన నాలుగో నృత్య తెలంగాణ కార్యక్రమంలో శ్రీలంక సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించిన కళాకారుల బృందం బుధవారం డా. బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసింది. ఈ సందర్భంగా శ్రీలంక కళాకారుల బృందాన్ని మంత్రి సన్మానించారు.



### సాంస్కృతిక మార్పిడికి ప్రోత్సాహం

శ్రంగిక ననయక్కర నేతృత్వంలోని శ్రీలంక కళాకారుల బృందం, సింగిడి సాంస్కృతిక సంస్థ డైరెక్టర్ విశ్వకర్మ డి.ఆర్.కే. ఆధ్వర్యంలో మంత్రిని కలిసింది. తెలంగాణ వేదికపై శ్రీలంక సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించిన కళాకారులను మంత్రి అభినందించారు. బౌద్ధం, సంస్కృతి, కళలు, వారసత్వం వంటి అంశాలు శ్రీలంక–తెలంగాణ మధ్య సుదీర్ఘ అనుబంధానికి ప్రతీకలని జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. ఇరు ప్రాంతాల మధ్య సాంస్కృతిక మార్పిడి కార్యక్రమాలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు.

నాగపూర్‌లోని దక్షిణ మధ్య సాంస్కృతిక కేంద్రం నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలను ఆ సంస్థ డైరెక్టర్ ఆస్తా కార్లేకర్ మంత్రికి వివరించారు. కేంద్రానికి తెలంగాణ ప్రభుత్వం నుంచి సహకారం అందించాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారు. దేశంలోని వివిధ ప్రాంతాలతో పాటు విదేశాలతోనూ సాంస్కృతిక సంబంధాలను మరింత బలోపేతం చేసే కార్యక్రమాలను ప్రోత్సహిస్తామని మంత్రి తెలిపారు. త్వరలోనే నాగపూర్‌లోని దక్షిణ మధ్య సాంస్కృతిక కేంద్రాన్ని సందర్శిస్తామని చెప్పారు. సాంస్కృతిక మార్పిడి, కళాకారుల పరస్పర భాగస్వామ్యం, బౌద్ధ వారసత్వ పరిరక్షణ, పర్యాటక అవకాశాల అభివృద్ధికి ఇలాంటి కార్యక్రమాలు మరింత దోహదపడతాయని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు.

# సిరిసిల్లలో గ్రామపంచాయతీ కార్మికుల నిరసన

ముద్ర, సిరిసిల్ల:

గ్రామపంచాయతీ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26 వేలు చెల్లించడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. కార్మికులకు హెల్త్ కార్డులు, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సీఐటీయూ తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాజన్న సిరిసిల్ల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం సిరిసిల్ల అంబేద్కర్ చౌక్ వద్ద గ్రామపంచాయతీ కార్మికులు నిరసన చేపట్టారు. అనంతరం తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా కోడం రమణ, యూనియన్ జిల్లా అధ్యక్షుడు బూర శ్రీనివాస్ మాట్లాడుతూ.. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ఎండ, వాన, చలి లెక్కచేయకుండా గ్రామపంచాయతీ కార్మికులు నిరంతరం శ్రమిస్తున్నారని తెలిపారు. తమ ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహిస్తున్న కార్మికుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రతి నెల ఒకటో తేదీన కార్మికుల బ్యాంకు ఖాతాల్లో జీతాలు జమ చేయాలని డిమాండ్ చేశారు. 60 ఏళ్లు పైబడిన లేదా మృతి చెందిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగ అవకాశం కల్పించాలని కోరారు. కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, ఆరోగ్య సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో స్థానిక అధికారులు, పాలకవర్గాలు కార్మికులను తొలగిస్తామని బెదిరిస్తున్నారని వారు ఆరోపించారు. బడ్జెట్ లేదనే సాకుతో నెలల తరబడి జీతాలు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సమస్యల పరిష్కారం కోసం జిల్లా అధికారులను కలిసి విజ్ఞప్తి చేసినప్పటికీ సమస్యలు పరిష్కారం కాలేదన్నారు.




రాష్ట్ర ప్రభుత్వం వెంటనే గ్రామపంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, జిల్లాలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకపోతే గ్రామపంచాయతీ కార్మికులంతా నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఎగమంటి ఎల్లారెడ్డి, జిల్లా కోశాధికారి అన్నల్దాస్ గణేష్, జిల్లా కార్యదర్శి మల్యాల నర్సయ్య, యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు లోకిని శ్రీనివాస్, కంసాని రవీందర్, నారపురం నరసయ్య, మహేష్, శేఖర్, అనిల్, కాంతయ్య, లక్ష్మి, పద్మతో పాటు పలువురు గ్రామపంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

## బ్యాంక్ అధికారుల నిర్లక్ష్యం.. రుణమాఫీ కోల్పోయిన పేద రైతు

- ప్రజా భవన్ ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా ఫలితం లేదని రైతు రమణారెడ్డి ఆవేదన..

ముద్ర చిగురుమామిడి:

మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ అధికారుల నిర్లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన రుణమాఫీ పథకానికి అర్హుడను కాలేకపోయానని ఓ పేద రైతు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాడు. లంబాడిపల్లె గ్రామానికి చెందిన జంగ రమణారెడ్డి అనే రైతు చిగురుమామిడి మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ లో 2019నుండి లక్షా 50 వేల రూపాయల క్రాప్ లోను తీసుకుంటూ రెన్యువల్ చేస్తు వస్తున్నాడు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం రెండు లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పడం, అధికారులు క్రాప్ లోన్ డబ్బులను రెన్యువల్ చేసుకుంటేనే రుణమాఫీ వర్తిస్తుందని ఒత్తిడి తేవడంతో అప్పుచేసి క్రాప్ లోను వడ్డీతో కలిపి లక్షా అరవై వేల రూపాయలను 2023 డిసెంబర్ 8న బ్యాంకులో కట్టినట్టు చెప్పాడు. అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ డిసెంబర్ 9న చివరి తేదీగా ప్రకటించింది. రైతు డిసెంబర్ 8న డబ్బులు బ్యాంకు ఖాతాలో వేస్తే అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించి 11న క్రాప్ లోను రెన్యువల్ చేశారని దీంతో తీవ్రంగా నష్టపోయానని బాధిత రైతు రోధిస్తూ తెలిపాడు. తనకు రుణమాఫీ కాలేదని కరీంనగర్ ప్రజావాణిలో సైతం ఫిర్యాదు చేసిన ఎవరు పట్టించుకోలేదని, రమణారెడ్డి విలపిస్తున్నారు. సన్న చిన్న కారు రైతునైన తనకు తీవ్ర నష్టం వాటిలిందని, సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ వెంటనే స్పందించి తనకు రుణమాఫీ చేసి న్యాయం చేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించిన బ్యాంక్ అధికారులపై తగు చర్యలు తీసుకోవాలని బాధిత రైతు ప్రభుత్వాన్ని కోరుతున్నాడు. ఎన్నికలకు ముందు ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు బాధిత రైతుకు న్యాయం చేసి రుణమాఫీ చేయాలని రైతులు శ్యామకూర మోహన్ రెడ్డి, కాటం హనుమంత్ రెడ్డి, ప్రభుత్వాన్ని కోరారు.



## తాళం వేసిన ఇంట్లో చోరీ

- దొంగ పట్టివేత

ముద్ర, మంచిర్యాల:

క్యాతనపల్లి మున్సిపాలిటీ తిమ్మాపూర్ గ్రామంలోని పద్మావతి కాలనీలో నివాసముండే రెడ్డిమల్ల శోభారాణి–తిరుపతి దంపతులు ఈ నెల 20వ తేదీన హైదరాబాద్‌లోని తమ కూతురి ఇంటికి వెళ్లారు. తిరిగి 24న ఇంటికి వచ్చే సరికి ప్రధాన ద్వారం తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న వెండి, బంగారం అపహరించారు. సుమారు రూ.5 వేల వరకు ఉంటుందని బాధితుడు రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పదంగా పోలీసుల నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నించిన సిరికొండ శంకర్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించగా, శంకర్ నేరం ఒప్పుకున్నట్లు ఎస్ఐ జాడి శ్రీధర్ తెలిపారు.



## శిథిలావస్థలో ఉన్న ఇల్లు కూలి మహిళ మృతి

ముద్ర, సిరిసిల్ల:

రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. శిథిలావస్థకు చేరిన ఇల్లు కూలిపోవడంతో నిద్రిస్తున్న గుమ్మడి లక్ష్మి (40) అనే మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికులు తెలిపిన ప్రకారం.. మామిడిపల్లికి చెందిన గుమ్మడి కమలాకర్, లక్ష్మి దంపతులు రోజువారీ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తెకు వివాహం కాగా, కుమారుడు హైదరాబాద్‌లో చదువుకుంటున్నాడు. కమలాకర్, లక్ష్మి నివాసముంటున్న ఇల్లు శిథిలావస్థకు చేరింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇంటి గోడలు పూర్తిగా నానిపోయాయి. ఈ క్రమంలో బుధవారం ఉదయం లక్ష్మి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో ఒక్కసారిగా పైకప్పు కూలిపోయింది. పైకప్పు, గోడల శిథిలాలు ఆమెపై పడటంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. ప్రమాదం జరిగిన సమ యంలో భర్త కమలాకర్ ఇంట్లో లేకపోవడంతో ఆయన ప్రమాదం నుంచి బయటపడ్డారు.

సమాచారం అందుకున్న కోనరావుపేట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
గురువారం 27.08.2026
www.mudranews.in | @mudranews



**ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లకు దూరంగా ఉండండి**

ప్లాస్టిక్ బాటిళ్లను వీలైనంత వరకు తగ్గించడం మంచిది. ముఖ్యంగా వేడి ప్రదేశాల్లో ఉంచిన ప్లాస్టిక్ బాటిళ్ల వినియోగాన్ని నివారించాలి. తప్పనిసరి పరిస్థితుల్లో నాణ్యమైన, బీపీఏ-ఫ్రీ బాటిళ్లను ఎంచుకోవడం మంచిది.



# విలువలతో కూడిన విద్యతో సమగ్ర వికాసం

### శ్రీ స్వామి నారాయణ పాఠశాల శంకుస్థాపన లో మంత్రి తుమ్మల

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, 26 :** ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం జింకలతండ గ్రామం వద్ద శ్రీ స్వామినారాయణ గురుకుల పాఠశాల నిర్మాణానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఘనంగా శంకుస్థాపన చేశారు. ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందిన స్వామి నారాయణ సంస్థ ఖమ్మం పరిసర ప్రాంతాల్లో తన శాఖను ఏర్పాటు చేయడం స్థానిక విద్యార్థులకు లభించిన గొప్ప వరమని మంత్రి పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ భారతదేశ ఔన్నత్యాన్ని, సాంస్కృతిక విలువలను ప్రపంచానికి చాటి చెప్పడంలో స్వామినారాయణ గురుకుల విద్యాసంస్థలు అగ్రగామిగా నిలుస్తున్నాయని అన్నారు కేవలం పుస్తక జ్ఞానమే కాకుండా విద్యార్థులకు సంస్కారవంతమైన చదువు, నాణ్యమైన విద్యనందిస్తూ దేశ సంస్కృతి సాంప్రదాయాలను కాపాడటంలో సంస్థ సేవలు ప్రశంసనీయం అని తుమ్మల తెలిపారు.విద్య ద్వారానే సమాజంలో నిజమైన మార్పు సాధ్యమవుతుందని, ప్రపంచ స్థాయి విద్యా ప్రమాణాలతో



ఖమ్మంలో ఈ పాఠశాలను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని తుమ్మల చెప్పారు. గురుకుల పాఠశాల నిర్మాణానికి అత్యంత విలువైన ప్రభుత్వ స్థలాన్ని కేటాయించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ , ఆర్అండిబీ ఎస్ ఇ యుగందర్ రావు, సుడా ఛైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, స్వామినారాయణ గురుకుల సంస్థ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

### ఖమ్మంలో ఆధార్ సేవా కేంద్రం ప్రారంభించిన మంత్రి

మమత హాస్పిటల్ రోడ్డులోని కవిరాజ్ నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన 'ఆధార్ సేవా కేంద్రాన్ని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు.ఈ



సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లా ప్రజలకు సమర్థవంతమైన, సౌకర్యవంతమైన డిజిటల్ సేవలు అందించడమే లక్ష్యంగా ఈ కేంద్రాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు.కొత్త ఆధార్ నమోదుతో పాటు బయోమెట్రిక్, డెమోగ్రాఫిక్ అప్‌డేట్ల సేవలు లభిస్తాయని, కొత్త ఆధార్ నమోదు పూర్తిగా ఉచితంగా పొందవచ్చని తెలిపారు. ఉద్యోగులు, విద్యార్థులు, వృద్ధుల సౌకర్యార్థం ఆదివారాల్లో కూడా ఈ కేంద్రం పనిచేస్తుందని చెప్పారు.ఈ కార్యక్రమంలో సుడా ఛైర్మన్ పువ్వాల్ల దుర్గాప్రసాద్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, UIDAI డైరెక్టర్ కె.ఎం. భారతి తదితర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# కార్మికుల సమస్యల కోసం సమరశీల పోరాటాలు

### ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం 3వ మహాసభ సందర్భంగా భువనగిరిలో భారీ ర్యాలీ

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** కార్మికుల హక్కుల కోసం ఏఐటీయూసీ నిరంతరం రాజీలేని సమరశీల పోరాటాలు నిర్వహిస్తుందని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పేర్కొన్నారు. బుధవారం భువనగిరి సుమంగళి ఫంక్షన్ హాల్ లో జరిగిన ఏఐటీయూసీ యాదాద్రి భువన గిరి జిల్లా 3 వ మహాసభ లో ఆయన ముఖ్య అతిథి గా పాల్గొని మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం దేశంలో ఏర్పడిన మొట్టమొదటి సంఘం ఏఐటియుసి అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆలంబిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాల్ని తిప్పికొట్టేందుకు కార్మిక లోకం పోరాటాన్ని తీవ్రతరం చేయాలని పిలుపునిచ్చారు. పెట్రోల్ ,వంట గ్యాస్, డీజిల్ ధరలను పెంచి ప్రజలపై మోయలేని భారం వేశారని అన్నారు. కేంద్ర ప్రభుత్వ అవలంబిస్తున్న ఆర్థిక విధానాల వల్ల ధనవంతులు మరింత ధనవంతులుగా పేదవారు మరింత పేదవారిగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక లోకం కన్నెర్ర చేస్తే ప్రభుత్వాలు కూలిపోతాయని అన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎండి యూసుఫ్ మాట్లాడుతూభారతదేశంలో 1920 అక్టోబర్ 31 ఆవిర్భవించిన మొట్టమొదటి కార్మిక సంఘం ఏఐటియుసి అని అన్నారు. ఈ మహాసభలో




ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి, బండారపు వెంకటేశ్ సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి బోలగాని సత్యనారాయణ, ఏఐటీయూసీ జిల్ల కార్యదర్శి ఎండి ఇమ్రాన్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్ళెం కృష్ణ, చెక్క వెంకటేశ్,జిల్లా నాయకులు జి వెంకటేష్, పిల్లి శంకర్, బి మల్లేష్, ఇంజా హేమలత,ఎస్ సబిత,సామల శోబన్ బాబు , సామల భాస్కర్ ముంతాజ్ బేగం, చిలివేరు అంజయ్య, పల్లె శ్రీనివాస్ పుట్ట రమేష్, బి నరసింహ,ch మల్లేష్, లక్ష్మి,నిర్మల, జగన్, కృష్ణ, కుమార్ పాల్గొన్నారు.

## ఇంటింటికి మొక్కల పంపిణీ



**ముద్ర, మోత్కూర్:** వన మహోత్సవంలో భాగంగా మోత్కూర్ మున్సిపాలిటీ 12వ వార్డు సాయినగర్‌లో బుధవారం ఇంటింటికి మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కౌన్సిలర్ మెంట రమణ నగేష్ ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి మొక్కలను అందజేశారు. పచ్చదనం పెంపొందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కౌన్సిలర్ కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ షాకిరుద్దీన్, అన్నెపు యాకు, కాలనీవాసులు వీరమల్లు శ్రీను, మత్స్యగిరి, అన్నెపు రాములు, మరాఠి ధనమ్మ తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం



**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** గంగపుత్రుల ఆరాధ్య దైవం మారమ్మ దేవాలయం చుట్టూ సీసీ రోడ్డు నిర్మాణ పనులను భువనగిరి మున్సిపల్ చైర్మన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవికుమార్ బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మంజుల వెంకటేష్, 12వ వార్డు కౌన్సిలర్ తోటకూర విజయలక్ష్మి వెంకటేష్ యాదవ్, కౌన్సిలర్లు పాండు యాదవ్, వాణి గణేష్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు కూర వెంకటేష్, గంగపుత్రసంఘం అధ్యక్షులు యాంకర్ల వెంకటేష్, బోనబోయిన నరసింహ, వెంకర్ల లక్ష్మయ్య, బోనబోయిన సత్యనారాయణ, హస్నాబాలరాజ్, కాంగ్రెస్ నాయకులు బెండ లాల్ రాజ్, చల్లగురుగుల రఘుబాబు, వేణు రెడ్డి పాల్గొన్నారు.

# ఘనంగా మిలాద్–ఉన్–నబీ వేడుకలు

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** భువనగిరి పట్టణంలో బుధవారం ఘనంగా మీలాద్ ఉన్ నబి వేడుకలు జరుపుకున్నారు. జలీల్ పుర మజీద్ కమిటీ ఆధ్వర్యంలో మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుక ఈద్ మిలాద్-ఉన్-నబీ సందర్భంగా భక్తి గీతాలు శాంతి సందేశాన్ని అందిస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ జలీల్ పుర మసీదు నుండి ప్రారంభమై సమద్ చౌరస్తా, కుమ్మరి వాడ,నల్గొండ రోడ్డు మీదుగా అంబేద్కర్ చౌరస్తా నుండి జలీల్ పుర వరకు కొనసాగింది. ర్యాలీలో చిన్న పిల్లల తో సహా వృద్ధులు పాల్గొని నారే తక్ బీర్ అంటూ నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ప్రిన్స్ కార్నర్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన సభ ప్రాంగణం లో ప్రముఖ న్యాయవాది అబ్దుల్ రహీం, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అవేస్ చిస్తీ, మస్జీద్ కమిటీ అధ్యక్షుడు ఇక్బాల్ చౌదరి మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త ప్రపంచ మానవులకి శాంతి సందేశాన్ని ఇచ్చారని, ఇస్లాం అనేది శాంతి అని అనాడు మొహమ్మద్ ప్రవక్త చెప్పారని ఇస్లాం మతం కాదని శాంతి సందేశం అని అన్నారు. ప్రతి పౌరుడు శాంతి ద్వారా మతాలకు అతీతంగా కలిసిమెలిసి జీవించాలని మహమ్మద్ ప్రవక్త సూత్రాలను ప్రతి పౌరుడు పాటించాలని ప్రవక్త సన్మార్గంలో నడవాలని ప్రపంచ మానవులకి మహమ్మద్ ప్రవక్త ఆదర్శమని అన్నారు. పోలీస్ శాఖ వారి నుండి ప్రతిష్ట బందోబస్తు ఏర్పాటు



చేసినందుకు టౌన్ సిఐ రమేష్ ని, ఇతర పోలీసు అధికారులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బుర్హాన్, బట్టు రామచంద్రయ్య, గౌరవాధ్యక్షుడు ముష్టక్ చౌదరి, ఉపాధ్యక్షుడు ముస్తఫా ఖాద్రి, షకీల్, కార్యదర్శి కాజం అహ్మద్, జాయింట్ సెక్రెటరీ ఇక్బాల్ అహ్మద్, గఫర్ చౌదరి, సాదిక్ అలీ,సలవుద్దీన్, అమీరుద్దీన్, కోశాధికారి రహీముద్దీన్, ఉస్మాన్, షానూర్ బాబా, ఇంతియాజ్, సుజావద్దీన్, ఫహీం, గౌస్, టూఫీక్, ఖాదర్, సైఫులహ్, అఫ్రోజ్, ఇల్యాస్, సమీర్, జలీల్ పాల్గొన్నారు.

## స్వర్ణ'గిరి ప్రదక్షిణ'



శ్రవణ నక్షత్రం సందర్బంగా స్వర్ణగిరి క్షేత్రంలో బుధవారం ఉదయం 6 గంటలకు భక్తులు అధిక సంఖ్యలో గిరి ప్రదక్షిణ చేశారు. ముందుగా కొండ కింద ఉన్న శ్రీ వారి పాదాల వద్ద ప్రత్యేక పూజలు చేసి అనంతరం గోవింద నామ స్మరణ చేస్తూ గిరి ప్రదక్షిణ గావించారు. గిరి ప్రదక్షిణ చేసిన భక్తులకు ఆలయ నిర్వాహకులు మంచి నీరు మజ్జిగ అందించి దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఒక వంద ఎనిమిది బంగారు అష్టదళ పద్మ పుష్పాలతో, శ్రీ స్వామివారికి అష్టోత్తర శతనామాలతో అష్టదళ పాదపద్మార్చన సేవ చేశారు. - ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి

## గణేష్ ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి



### జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్

**ముద్ర ప్రతినిధి, ఖమ్మం, ఆగస్టు 26 :** ప్రశాంత వాతావరణంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలను నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ ఆదేశించారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, పోలీసు అధికారులతో కలిసి తీర్థాల వద్ద ఆకేరు నది, నగరంలోని కాల్వొడ్డు మున్నేరు, ప్రకాష్‌నగర్ నిమజ్జన ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు తీసుకోవాలని సూచించారు. నిమజ్జన పాయింట్ల వద్ద బ్యారికేడ్లు, తగినంత లైటింగ్, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, తాగునీరు, మొబైల్ టాయిలెట్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు.విగ్రహాల తరలింపు సమయంలో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చూడాలని, నిమజ్జనం వద్ద గజ ఈతగాళ్లు, SDRF బృందాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించాలని కోరారు. ఉత్సవ కమిటీలు, ప్రజలు అధికారులకు సహకరించి ఉత్సవాలను ప్రశాంతంగా పూర్తి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రామాంజనేయులు, ఇరిగేషన్ సీఈ వసంతి, ఏసిపిలు రమణమూర్తి, తిరుపతిరెడ్డి, తహసీల్దార్ జయచందర్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంపై మంత్రి ఉత్తమ్ దిగ్భ్రాంతి

**ముద్ర, సూర్యాపేట:** కోదాడ మండలం దోరకుంట సమీపంలోని హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే ఎన్. పద్మావతి రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.కంటైనర్‌ను ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొన్న ఘటనలో ప్రాణనష్టం సంభవించడం అత్యంత విషాదకరమని వారు పేర్కొన్నారు. గమ్యస్థానాలకు చేరుకోవాల్సిన ప్రయాణికుల జీవితాలు మార్గమధ్యంలోనే విషాదాంతం కావడం హృదయవిదారకమని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి ప్రగాఢ సానుభూతి తెలియ చేశారు.

## కేశ్య తండాలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**ముద్ర, దేవరకొండ:** కొండమల్లేపల్లి మండల పరిధిలో గల కేశ్య తండా గ్రామంలో మంగళవారం కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గ్రామ సర్పంచ్ రామావత్ రాజు నాయక్ లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి పెద్ద పీట వేస్తోందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం రేషన్ కార్డులతో పాటు తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం ఆరు గ్యారంటీలతో పాటు ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు.వారివెంట జిపిఓ నాగలక్ష్మి, లచ్చిరాం, జీపి వర్కర్ వినోద్, కళ్యాణ్, కీర్య, లక్ష్మణ్, రంగి తదితరులు పాల్గొన్నారు.



## మదర్ థెరిసా 116 వ జయంతి వేడుకలు

**ముద్ర, దేవరకొండ:** దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మదర్ థెరిసా 116 వ జయంతి వేడుకలు స్థానిక బీసీ బాలికల వసతి గృహమునందు నిర్వహించుకోవడం జరిగింది. మదర్ థెరిసా పటానికి అధ్యక్షుడు ఎన్వీటి సభ్యులతో కలసి పూలమాలలు వేసి నివాళులు అర్పించినారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి తాళ్ల శ్రీధర్ గౌడ్, కోశాధికారి కృష్ణ కిషోర్, వల్లమల్ల ఆంజనేయులు ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు, కరాటే మాస్టర్ గోపి, వివిర్, ఎస్ఎఫ్ ఐ డివిజన్ కార్యదర్శి వెంకటేష్, రాజేష్, మల్లయ్య, భాగ్యలక్ష్మి, రాజేశ్వరి, రాము, క్రీడాకారులు కళాకారులు తదితరులు పాల్గొన్నారు.



## 12 వార్డులో కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** భువనగిరి పట్టణంలోని 12 వార్డు పగిడిపల్లి గ్రామంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు వార్డ్ కౌన్సిలర్ తోటకూర విజయలక్ష్మి వెంకటేష్ కొత్త విద్యుత్ స్తంభాలు, కొత్త విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు సహకరించిన భువనగిరి చైర్పర్సన్ తంగలపల్లి శ్రీవాణి రవికుమార్, వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల వెంకటేష్ లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నోముల తరుణ్. కట్కూరి బిక్షపతి పాల్గొన్నారు.



## రెడ్ మిక్స్ వాహనం ఢీకొని వ్యక్తి మృతి

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** రెడ్ మిక్స్ వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన భువనగిరి మండలం వడపర్తి ఎక్స్ రోడ్ వద్ద బుధవారం రాత్రి చోటుచేసుకుంది. భువనగిరి మండలం రాయగిరి గచ్చుబాయికి చెందిన జెల్ల గణేష్ (38) బుధవారం రుస్తాపురం గ్రామంలో తన స్నేహితుడు దహన సంస్కారాలకి వెళ్లివస్తుండగా వడపర్తి ఎక్స్ రోడ్ వద్ద ఎదురుగా వస్తున్న రెడ్ మిక్స్ వాహనం అతి వేగంగా వస్తూ ఢీకొట్టడం తో అక్కడికక్కడే మరణించాడు. మృతదేహంను పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి జిల్లా కేంద్ర హాస్పిటల్ కి తరలించి ఆక్సిడెంట్ చేసిన డ్రైవర్ ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

## ప్రాజెక్ట్ ల నిధుల సాధనకై సిపిఎం పాదయాత్ర

**ముద్ర, మోత్కూరు:** జిల్లాలో సాగునీటి ప్రాజెక్ట్ లు పూర్తి చేయడంలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరశిస్తూ,సిపిఎం పార్టీ యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 29, 30, 31, తేదీలలో భువనగిరి నుండి ఇందిరాపార్క్ వరకు పాదయాత్ర, 31 న ఇందిరా పార్కులో జరిగే మహాధర్నాలో రైతులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చెయ్యాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు పిలుపు నిచ్చారు. బుధవారం మోత్కూర్ మండలం పాలడుగు ,రాగిభావి గ్రామాలలో ధర్నాకు సంబందించిన గోడ పత్రికలను రైతుల, కూలీలతో తో కలసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు దడిపల్లి ప్రభాకర్, పానుగుల రమేష్, శాఖ కార్యదర్శి పిట్టల చంద్రయ్య, ఎన్నం వెంకట్ రెడ్డి, దడిపల్లి సైదులు, వడ్డేపల్లి లక్ష్మణ్, రైతులు మర్రిపల్లి యాదయ్య, బోడిగే యాదయ్య, మిడిదొడ్డి మల్లయ్య పాల్గొన్నారు.



వాటర్ బాటిల్ :



రోజువారీ వాడకానికి స్టీల్ బెస్ట్. ప్రతిరోజూ నీళ్లు తీసుకెళ్లేందుకు స్టెయిన్‌లెస్ స్టీల్ బాటిల్ మంచి ఎంపిక. మన్నికగా ఉండటంతో పాటు సాధారణంగా నీటితో రసాయన చర్యలకు గురికాదు. ఇంటి నుంచి ఆఫీసు, ప్రయాణాల వరకు నిత్య విని యోగానికి అనుకూలంగా ఉంటుంది.


# రేపు అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో గ్రామ, వార్డు సభలు

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతిమా సింగ్**



**ముద్ర ప్రతినిధి, మెదక్:** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ఈనెల 27న జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో గ్రామ, వార్డుసభలు నిర్వహిం చనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. ఈ సభల్లో సంబంధిత పోలింగ్ కేంద్ర స్థాయి అధికారులు తమ పరిధిలోని ఓటరు జాబితాలను ప్రజల సమక్షంలో చదివి వినిపిస్తారని పేర్కొన్నారు. ఓటర్లు తమ పేరు, చిరునామా, ఇతర వివరాలు సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించుకునేందుకు అవకాశం కల్పిస్తారని తెలిపారు.అర్హులైన పౌరులు ఓటరు జాబితాలో కొత్తగా పేరు నమోదు చేసుకునేందుకు దరఖాస్తు నమూనా–6, పేరు తొలగింపు లేదా అభ్యంతరాల కోసం నమూనా–7, వివరాల సవరణ కోసం నమూనా–8ను వినియోగించుకో వాలని సూచించారు.ఆచూకీ లేని, ఇతర ప్రాంతాలకు వెళ్లిన, మరణించిన, రెండు చోట్ల నమోదైన ఓటర్ల జాబితాలను కూడా గ్రామ, వార్డు సభల్లో ప్రజల పరిశీ లనకు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. అందులో ఏవైనా తప్పులు ఉన్నట్లు గుర్తిస్తే తగిన ఆధారాలతో సవరణకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ జాబి తాలతోపాటు వివరాలు ఉన్న, గత ఓటరు జాబితాతో అనుసంధానం కాని ఓటర్ల వివరాలను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు అందుబాటులో ఉంచి ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో పారదర్శకత పాటించనున్నట్లు వెల్లడించారు.

# సూర్యాపేట రోడ్డు ప్రమాదం.. సీఎం, మంత్రుల సంతాపం




**ముద్ర, సూర్యాపేట :** సూర్యాపేట జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకో వాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజును ఆదేశించారు. బుధవారం ఉదయం సూర్యాపేట జిల్లా కోదాడ మండ లం ద్వారకుంట సమీపంలో కంటైనర్‌ను ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టిన దుర్ఘటనలో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు.

**మంత్రుల సంతాపం**

సూర్యాపేట బస్సు ప్రమాద ఘటనపై మంత్రులు దామోదర్ రాజనర్సింహ, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట రెడ్డి, కొండా సురేఖ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబ సభ్యులకు మంత్రి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను కోరారు. మృతదేహాలకు త్వరగా పోస్టుమార్టం నిర్వ హించాలని అధికారులను ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. పోస్టుమార్టం కోసం రెండు బృందాల ఏర్పాటు చేయాలని, మృతదే హాలను కుటుంబ సభ్యులకు త్వరగా అప్ప గించాలని సూచించారు. కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి, తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కూడా ప్రమాదంపై దిగ్భ్రాంతి తెలిపారు.ప్రభుత్వం ఆదుకోవాలిసూర్యాపేట రోడ్డు ప్రమాదంపై బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో ఆరుగురు ప్రయాణికులు మృతి చెందడం అత్యంత బాధాకరమని అన్నారు. కోదాడ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగా త్రులకు ప్రభుత్వం తక్షణమే మెరుగైన వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేశారు. గాయపడిన వారు త్వరగా పూర్తిస్థాయిలో కోలుకోవాలని ఆకాంక్షించారు. ఊహించని ఈ ప్రమాదంలో ఆత్మీయులను కోల్పోయి శోకసంద్రంలో ఉన్న బాధిత కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు.ఘటనా స్థలంలో కలెక్టర్‌కోదాడ మండలం ద్వారకుంట వద్ద జరిగిన రోడ్డు ప్రమాద స్థలాన్ని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పరిశీలించారు. ప్రమాద వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సహాయక చర్యలను పర్యవేక్షించారు. ప్రమాదంలో చనిపోయిన వారి కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య పరామర్శించారు. డ్రైవర్ మారిన మరుక్షణమే.. తాను డ్యూటీ మారిన తర్వాతనే ప్రమాదం జరిగిందని రెండో డ్రైవర్ మీడియాతో చెప్పారు. సూర్యాపేటలో తాను డ్రైవింగ్‌ను మరో డ్రైవర్‌కు అప్పగించి, పడుకున్నానని వెల్లడించారు. తర్వాత కొద్దిసేపటికే ప్రమా దం సంభవించిందని తెలిపారు. బస్సులో 42 మంది ఉన్నారని చెప్పారు.కొద్దిలో బతి కిపోయావెనుక సీటులో కూర్చోవడం వల్ల ప్రమాదం నుంచి కొద్దిలో ప్రాణాలతో బయటపడ్డానని ఓ ప్రయాణికుడు తెలిపారు. రాఖీ పండుగ కోసం చెల్లెలు దగ్గరికి వెళుతుండగా ప్రమాదం బారిన పడ్డానని చెప్పారు. ఇనుప రాడ్ తన ముఖం వరకు వచ్చి ఆగడంతో బతికిపోయానని వెల్లడించారు. బస్సు సూర్యాపేటలో ఆగి.. మళ్లీ స్టార్ట్ అయిన 15 నిమిషాల్లోనే ఈ యాక్సిడెంట్ జరిగిందని తెలిపారు.

# బంగ్లాదేశ్ స్వయంకృతాపరాధం

**భారత్ చర్యలతో మరిన్ని ఇబ్బందులు**



**(ముద్ర, డెస్క్ )**

ప్రభుత్వం బలహీనంగా ఉన్నప్పుడు, ప్రతిపక్షం బలంగా ఉన్నప్పుడు తప్పుల మీద తప్పులు జరగడం సహజం. బంగ్లాదేశ్‌లో ఇది మళ్లీ మళ్లీ కనిపిస్తోంది. 2026 ఫిబ్రవరిలో ఎన్నికల్లో గెలిచి ప్రధానమంత్రి అయిన తారిక్ రహ్మాన్ ప్రభుత్వం మెజారిటీ ఉన్నా ఆత్మవిశ్వాసం లేకుండా కనిపిస్తోంది. అంతర్గత శక్తుల భయం, ముఖ్యంగా జమాతే ఇస్లామీ ప్రభావం, విదేశాంగ విధానంలో స్పష్టత లేకపోవడం భారత్‌తో సంబంధాలను దెబ్బతీస్తున్నాయి. సంప్రదాయానికి విరుద్ధంగా..బంగ్లాదేశ్ ప్రధానులు అధికారంలోకి వచ్చాక సాధారణంగా మొదట భారత్‌ను సందర్శించేవారు. ఎందుకంటే 4,096 కిలోమీటర్ల సరిహద్దు, నదుల నీటి వనరులు, వాణిజ్య మార్గాలు, విద్యుత్ సరఫరా, వైద్య సేవలు ఇలా అన్నింటిలోనూ భారత్‌పై ఆధారపడి ఉంది. కానీ తారిక్ రహ్మాన్ మొదటి విదేశీ పర్యటనగా మలేషియా, తర్వాత చైనాను ఎంచుకున్నారు. జూన్ 2026లో బీజింగ్‌లో జీ జిన్‌పింగ్, ఇతర నాయకులతో సమావేశాలు జరిపి సంబంధాలను కొత్త స్థాయికి తీసుకెళ్లారు. తీస్తా నది నిర్వహణ కోసం చైనా సహకారం కోరారు. ఈ నది సిక్కింలో పుట్టి బంగ్లాదేశ్‌లోకి ప్రవహిస్తుంది. భారత్‌తో గతంలో చర్చలు సాగినా పరిష్కారం కాలేదు. ఇప్పుడు చైనా సాంకేతిక, ఆర్థిక సహాయం అందించే దిశగా అంగీకారం కుదిరింది. ఇంకా యునాన్ నుంచి మయన్మార్ మీదుగా బంగ్లాదేశ్‌కు ఆర్థిక కారిడార్ ఆలోచన కూడా ముందుకు వచ్చింది. కానీ మయన్మార్‌లో అస్థిరత, సాయుధ సమూహాల నియంత్రణ ఉన్న ప్రాంతాల్లో రోడ్డు నిర్మాణం, భద్రత ఆచరణలో కష్టమే అని నిపుణులు అంటున్నారు.లాల్మోనీర్‌హాట్ విమానాశ్రయం (పాత వైమానిక స్థావరం) ఆధునీకరణ గురించి కూడా చర్చలు ఉన్నాయి. ఇది సిలిగుడి కారిడార్‌కు సమీపంలో ఉండటం భారత రక్షణ దృష్ట్యా ఆందోళన కలిగిస్తోంది. జె–10సీఈ విమానాల కొనుగోలు చర్చలు కూడా ముందుకు సాగుతున్నట్లు నివేదికలు ఉన్నాయి.భారత్ పర్యటనకు బ్రేక్..ఆగస్టు 23 నుంచి 25 తేదీ వరకు తారీఖ్ రహ్మాన్ భారత్‌లో పర్యటించాలి. కానీ అది జరగలేదు. షేక్ హసీనా అప్పగించాలనిషరతు పెట్టాడు. ఆమె ఇచ్చిన ప్రెస్ కాన్ఫరెన్స్ వల్ల వాతావరణం దెబ్బతిన్నట్లు ఢాకా వాదన. ఇలాంటి షరతులతో సంబంధాలు ముందుకు సాగవు. భౌగోళిక, ఆర్థిక వాస్తవాలను దృష్టిలో పెట్టుకుని వ్యవహరించాల్సిన అవసరం ఉంది. బంగ్లాదేశ్‌కు విద్యుత్, డీజిల్ సరఫరాలో భారత్ కీలకం. ప్రస్తుతం గ్యాస్, విద్యుత్ సంక్షోభం తీవ్రంగా ఉంది. లోడ్ షెడ్డింగ్, దుకాణాలు సాయంత్రం మూసివేత, టెక్స్‌టైల్ రంగం ఇబ్బందులు ఎదుర్కొంటోంది. అదనపు డీజిల్ కోసం భారత్‌ను ఆశ్రయించాల్సి వచ్చింది. సరుకు రవాణా, వైద్య చికిత్సల కోసం కూడా భారత్ మీదుగానే అనేక మంది వస్తున్నారు. ఈ ఆధారపడికి వ్యతిరేకంగా ధోరణి ఉంటే ఆర్థిక నష్టం తప్పదు.భారత్ ప్రతిచర్యలు షురూ..బంగ్లాదేశ్ తీరుతో భారత్ ప్రతిచర్య మొదలు పెట్టింది. సిలిగుడి కారిడార్‌ను బలోపేతం చేస్తోంది. కిషన్‌గంజ్, చోప్రా, ధుబ్రి వంటి ప్రాంతాల్లో కొత్త సైనిక స్థావరాలు, త్రిభుజ రక్షణ వ్యవస్థ ఏర్పాటు చేస్తుంది. ఇది సరిహద్దు భద్రత, చొరబాట్ల నియంత్రణకు సంబంధించినది. విద్యుత్ సరఫరాపై అదనపు సెస్ లాంటి చర్యలు, నీటి వనరులపై ప్రభావం కూడా సాధ్యమే. సంబంధాలు కుదురుకోకపోతే బంగ్లాదేశ్‌కు మరింత ఇబ్బంది కలుగుతుంది.విదేశాంగ బలహీనతప్రభుత్వం జమాతే ఇస్లామీ వంటి శక్తుల భయంతో భారత్‌తో సన్నిహితంగా ఉండలేకపోతోంది. అవసరమైనప్పుడు ఆశ్రయించి, స్నేహానికి దూరంగా ఉండే విధానం స్థిరమైనది కాదు. రా చీఫ్ పర్యటన లీక్ కావడం వంటి సంఘటనలు విశ్వాసాన్ని మరింత తగ్గిస్తాయి.నీరు, విద్యుత్, వాణిజ్యం, ఉపాధి భారత్‌తో ముడిపడి ఉన్నాయి. చైనా సహకారం ఆర్థికంగా ఉపయోగపడవచ్చు కానీ భౌగోళిక వాస్తవాలను విస్మరించి సంబంధాలు నిర్మించడం సాధ్యం కాదు. హేతుబద్ధమైన, పరస్పర ప్రయోజనాల ఆధారంగా విధానం రూపొందితేనే స్థిరత్వం వస్తుంది. లేకపోతే అంతర్గత సంక్షోభాలు, ఆర్థిక ఇబ్బందులు మరింత పెరుగుతాయి.



**ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కుమార్తె వివాహానికి సీఎం చంద్రబాబు**

**ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ గారి కుమార్తె త్రిలోక్య వివాహ కార్యక్ర మానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దంపతులు హాజరయ్యారు. వధూవరులు త్రిలోక్య - ప్రభాస్ లను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.**

**- ముద్ర, హైదరాబాద్**

## సర్‌ను పూర్తిచేయడంలో బాధ్యతగా వ్యవహరించాలి

**ముద్ర, కరీంనగర్:** ఓటర్ల జాబితాను సమగ్రంగా పరిశీలించేందుకు చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ సర్వేను పారదర్శకంగా పూర్తి చేయడంలో కాంగ్రెస్ ప్రతినిధులు బాధ్యతగా వ్యవహరించాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిల్ల శ్రీనుబాబు సూచించారు. బుధవారం పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ రెండో దశపై బూత్ స్థాయి ఏజెంట్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న శ్రీనుబాబు మాట్లాడుతూ సర్వేలో ఏ ఒక్క ఓటు కూడా తప్పిపోకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. శిక్షణలో అందించిన మార్గదర్శకాలపై పూర్తిస్థాయి అవగాహన పెంచుకుని బాధ్యతగా విధులు నిర్వహించాలని సూచించారు. పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాగూర్ మాట్లాడుతూ జిల్లాలోని ఏ పట్టణ, గ్రామీణ ప్రాంతానికి చెందిన ఓటు కూడా జాబితా నుంచి తప్పిపోకుండా చూడాలన్నారు. ఓట్ల తొల గింపునకు కేంద్రం కుట్రలు చేస్తోందని ఆరోపించిన ఆయన, ఈ అంశాలపై కాం గ్రెస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని సూ చించారు. మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, పరిశీ లకులు దీపక్ రాథోడ్, ప్రభాకర్‌రెడ్డి, ఫహీం, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు, బూత్ స్థాయి ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆర్అండ్‌బీ షాపింగ్ కాంప్లెక్స్‌లో స్థానిక చేతి వృత్తిదారులకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలి




**ముద్ర, హుజూర్‌నగర్:** పట్టణంలోని ఆర్అండ్‌బీ శాఖ స్థలంలో నూతనంగా నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్‌లో స్థానిక చేతివృత్తిదారులు, చిన్న వ్యాపారులకు తొలి ప్రాధాన్యత కల్పించాలని బీజేపీ హుజూర్‌నగర్ పట్టణ అధ్యక్షుడు కొండ హరీష్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బాధితులతో కలిసి ఆర్అండ్‌బీ శాఖ డీఈఈ రమేష్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా కొండ హరీష్ గౌడ్ మాట్లాడుతూ.. హుజూర్‌నగర్‌లోని ఆ ప్రాంతంలో 30, 40 ఏళ్లుగా నివసిస్తూ తరతరాలుగా చిన్న కులవృత్తులు, చేతివృత్తులపై ఆధారపడి కుటుంబాలను పోషించుకుంటున్న అనేక మంది ప్రస్తుతం జీవనోపాధి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కొత్తగా నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్‌లో స్థానిక వృత్తిదారులు, చిన్న వ్యాపారులకు ప్రాధాన్యత కల్పిస్తే వారికి, వారి కుటుంబాలకు స్థిరమైన జీవనోపాధి లభిస్తుందని అన్నారు.షాపుల కేటాయింపులో స్థానికులకు, ముఖ్యంగా తరతరాలుగా కులవృత్తులపై ఆధారపడి జీవిస్తున్న వారికి తొలి ప్రాధాన్యత ఇచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యను సానుకూలంగా పరిశీలించి బాధితులకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో బాధితుల పక్షాన పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. బీజేపీ లీగల్ సెల్ నాయకులు పిడమర్తి చంద్రయ్య, మేళ్లచెరువు లక్ష్మణ్, చుక్క హరీష్, సతి బల్వంత్ సింగ్‌తో పాటు బాధితులు మంగమ్మ, నాగమణి, మేరీ, ఈశ్వరమ్మ, లింగయ్య పాల్గొన్నారు.

## ఆయిల్‌పామ్ సాగుకు భారీ ప్రోత్సాహం



**ముద్ర, హైదరాబాద్:** తెలంగాణలో వరికి లాభదాయక ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్ సాగును విస్తరిం చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. సూర్యాపేట జిల్లాలో ఇంటిగ్రేటెడ్ ఆయిల్‌పామ్ హబ్ ఏర్పాటుకు రిలయన్స్ ఆసక్తి చూపుతోంది. కోదాడ–హుజూర్‌నగర్‌ను ఆయిల్‌పామ్ ప్లాంటేషన్–ప్రాసెసింగ్ క్లస్టర్‌కు ప్రారంభ కేంద్రంగా పరిశీలించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించారు.రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఖేతన్ మోదీ నేతృత్వంలోని బృందంతో మంత్రి ఉత్తమ్, వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వ రరావు, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి సమావేశమయ్యారు. రైతును వరి నుంచి ఇతర పంటల వైపు మళ్లించాలంటే అధిక ఆదాయం, మార్కెట్ భరోసా కల్పించాల్సిన అవసరం ఉందని ఉత్తమ్ అన్నారు. సూర్యాపేట, ఖమ్మం, కొత్తగూడెం జిల్లాలను అనుసంధానిస్తూ ఆయిల్‌పామ్ కారిడార్ ఏర్పాటుపై అధ్యయనం చేయాలని సూచించారు.రాష్ట్రంలో ప్రస్తుతం 3.12 లక్షల ఎకరాల్లో 65,691 మంది రైతులు ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారు. ఇప్పటివరకు రూ.515.84 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసింది. సూర్యాపేట జిల్లాలో 5,753 ఎకరాల్లో సాగు జరుగుతోంది. త్వరలో కోదాడ, హుజూర్‌నగర్, సూర్యాపేట, ఖమ్మం, కొత్తగూడెం ప్రాంతాల్లో రిలయన్స్ ప్రతినిధులు క్షేత్రస్థాయి పర్యటనలు చేపట్టనున్నారు. రైతుకు ఆదాయం.. సాగునీటికి పొదుపు.. రాష్ట్రానికి పరిశ్రమ లక్ష్యంగా ఆయిల్‌పామ్ విస్తరణ చేపడుతున్నామని తెలిపారు.

## హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన

**ముద్ర ప్రతినిధి మెదక్:** మెదక్ పట్టణంలోని గాంధీనగర్‌లో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సుమారు 30 మందికి హెచ్ఐవీ పరీక్షలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎస్టీఐ కౌన్సిలర్ కాముని రాజేశ్వర్ మాట్లాడుతూ.. ఎయిడ్స్‌కు ప్రస్తుతం పూర్తిస్థాయి మందు లేదని, నివారణ ఒక్కటే మార్గమని తెలిపారు. సుఖవ్యాధులు ఉన్నవారికి హెచ్ఐవీ సోకే అవకాశం పది రెట్లు ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. హెచ్ఐవీ బాధితులు భయపడాల్సిన అవసరం లేదని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా మందులు అందిస్తున్నట్లు తెలిపారు. అర్హులకు పెన్షన్ సదుపాయంతో పాటు ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నవారికి ప్రభుత్వం ద్వారా రుణ సదుపాయాలు కల్పిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సులోచన, కవిత, ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆహార ప్రాసెసింగ్ యూనిట్లకు అవకాశం

**జిల్లా పరిశ్రమల మేనేజర్ యాదగిరి**



**ముద్ర ప్రతినిధి, మెదక్:** మెదక్ జిల్లా పారిశ్రామిక శాఖ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకం ద్వారా ఆర్థిక సహాయం, సాంకేతిక మార్గ దర్శకత్వం, వ్యాపారాభివృద్ధి అవకాశాలను అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా పరిశ్రమల మేనేజర్ యాదగిరి తెలిపారు.జిల్లాలోని సూక్ష్మ ఆహార ప్రాసెసింగ్ వ్యాపారులకు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఎఫ్పీఓలు, రైతులు, ఔత్సా హికులకు అవకాశం ఉందన్నారు. ఈ పథకం ద్వారా ఇప్పటికే ఉన్న ఆహార ప్రాసెసింగ్ యూనిట్ల అభివృద్ధితో పాటు, అర్హత కలిగిన కొత్త యూనిట్ల ఏర్పాటుకు కూడా ప్రోత్సాహం లభిస్తుంది. పండ్లు– కూరగాయల ప్రాసెసింగ్, ధాన్యాలు–పప్పుధాన్యాలు, మసాలాలు, బేకరీ ఉత్పత్తులు, పాలు మరియు పాల ఉత్పత్తులు, నూనె గింజల ప్రాసెసింగ్, పికిల్స్, జామ్లు, పల్ప్, డీహైడ్రేటెడ్ ఉత్పత్తులు, రెడీ–టు–ఈట్ తదితర విలువ ఆధారిత ఆహార ఉత్పత్తుల యూనిట్లకు ఈ పథకం ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు.ఆహార ఉత్పత్తుల విలువ జోడింపు, ప్యాకేజింగ్, బ్రాండింగ్ మరియు మార్కెటింగ్కు ప్రోత్సాహం అందించడం జరుగుతుందన్నారు.

## మిలాద్-ఉన్-నబీ వేడుకలు ప్రశాంతం



**ముద్ర ప్రతినిధి, మెదక్:** మెదక్ జిల్లా వ్యాప్తంగా మిలాద్–ఉన్–నబీ వేడుకలు ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. మెదక్ టౌన్, చేగుంట, శంకరంపేట–ఎ, టేక్మాల్, నార్సింగి, నర్సాపూర్ పట్టణాలతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో వేడుకలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా జిల్లా పోలీసు యంత్రాంగం ముందస్తు ప్రణాళికతో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. వేడుకలు, ప్రార్థనలు, ఊరేగింపుల సందర్భంగా ప్రజల రాకపోకలు, ప్రధాన కూడళ్లు, ప్రార్థనా మందిరాలు, సున్నితమైన ప్రాంతాలు, ఊరేగింపు మార్గాలపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పోలీసు అధికారులు, సిబ్బంది నిరంతరం పరిస్థితిని పర్యవేక్షించారు. ఊరేగింపుల సందర్భంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా అవసరమైన ప్రాంతాల్లో నియంత్రణ చర్యలు చేపట్టారు. సీసీ కెమెరాలు, మొబైల్ పెట్రోలింగ్, రూట్ మొబైల్ బృందాల ద్వారా పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. మెదక్ పట్టణంలో ర్యాలీ నిర్వహించగా డీఎస్పీ ప్రసన్న కుమార్ ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేశారు.


Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L.N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H.No.7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg.No.TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555